

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ప్రేమలతారెడ్డి

క్వార్టర్ నిర్మాణం క్యాన్సిల్ 2

- మునిసిపల్ సమావేశంలో తిరస్కరించిన సభ్యులు
- గణేష్ నిమజ్జనం, సద్దుల బతుకమ్మ ఏర్పాట్లకు రూ.5.17 లక్షలు కేటాయింపు
- పారిశుధ్య సమస్యలపై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



20 జనగామ

బుధవారం 30, ఆగస్టు 2017

జనగామ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కళాకారులు



ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుడు

జిల్లా కేంద్రంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వివిధ రంగాలకు చెందిన కళాకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. జానపద గేయాలు, నృత్యాలు, ఒగ్గు కళాకారుల ఆటాపాట, బైండ్ల, పంబాల వారి విన్యాసాలు, డోలు వాయిద్యాలు, బంజారా మహిళల కోలాటాలు పుర ప్రజలను అలరించాయి. అనంతరం జూబ్లీ గార్డెన్స్‌లో జరిగిన వేడుకలను కలెక్టర్ శ్రీదేవసేన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులు నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.


- జనగామ కల్చరల్

జన జాతర

కళాకారుల భారీ ర్యాలీ

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రారంభించిన కలెక్టర్ శ్రీదేవసేన
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ
- ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం

20



ర్యాలీలో డప్పు కళాకారుల నృత్యాలు

సీపీఎస్‌పై ఉపాధ్యాయుల ఉద్యమం

అమలుకు నిరసనగా 1న సామూహిక సెలవులు

పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్

వివరాలు : 2లో..

సమ్మె బాటలో.. సాక్షరభారత్ కోఆర్డినేటర్లు

వివరాలు : 3లో..

క్రీడల్లో రాణించాలి

వాలీబాల్ పోటీలు ప్రారంభించిన కలెక్టర్ • జిల్లాలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



20

ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీదేవసేన



హతవిధీ.. 'ఈ - ఔషధి'

రోగుల వివరాల నమోదులో వైద్యుల నిర్లక్ష్యం

సెంటర్ స్ప్రెడ్‌లో...

- ప్రభుత్వ ఆస్పత్రులలో కొత్త సాఫ్ట్‌వేర్
- మార్చి నెలలోనే అందుబాటులోకి
- ఇంకా గాడిన పడని పనితీరు
- ఆసక్తి చూపని సిబ్బంది
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

క్వార్టర్ నిర్మాణం క్యాన్సిల్



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు

- మునిసిపల్ సమావేశంలో తిరస్కరించిన సభ్యులు
- గణేష్ నిమజ్జనం, సద్దుల ఏర్పాట్లకు రూ.5.17 లక్షలు కేటాయింపు
- పారిశుధ్య సమస్యలపై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు

జనగామ, ఆంధ్రజ్యోతి: పట్టణంలోని 22వ వార్డులో కమిషనర్ క్వార్టర్ నిర్మాణం కోసం చేసిన ప్రతిపాదనను మునిసిపల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు తిరస్కరించారు. దానికోసం కేటాయించిన రూ. 30 లక్షల నిధులతో తహసీల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మునిసిపల్ షట్టర్లను మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ జి.ప్రేమలతారెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన మునిసిపల్ సర్వసభ్య సమావేశంలో ఎజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మునిసిపల్ ఖాళీ స్థలంలో కమిషనర్ క్వార్టర్ కోసం రూ.30 లక్షలు కేటాయించే విషయమై జరిగిన చర్చలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఎండీ.అన్వర్, వంగాల కళ్యాణితో పాటు ఇతర కౌన్సిలర్లు ఆ అంశాన్ని తిరస్కరించారు. 'కమిషనర్ క్వార్టర్ అవసరమా' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ప్రతిపక్ష కౌన్సిలర్లు క్వార్టర్ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ నిధులతో మునిసిపల్ షట్టర్ల మరమ్మతు చేపడితే నెలనెలా అద్దె రూపేణా ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేశారు. దీంతో క్వార్టర్ నిర్మాణం ప్రస్తావనను పక్కన పెట్టారు.

రూ. 5.17 లక్షలతో ఉత్సవాలకు ఏర్పాట్లు..

జిల్లా ఏర్పాటైన తర్వాత తొలిసారిగా జరుగుతున్న గణేష్ నిమజ్జనం, సద్దుల బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లకు రూ.5.17 లక్షలు కేటాయించే అంశంపై సభ్యులు చర్చించి ఆమోదించారు. నెల్లుట్ల చెరువు వద్ద గణేష్ నిమజ్జనం కోసం రూ.1.30 లక్షల నిధులు కేటాయించగా ఇందులో రూ.80 వేలు చెరువు వద్ద లైటింగ్, క్రేన్‌ల ఏర్పాటుకు, సూర్యాపేట మెయిన్ రోడ్డు నుండి చెరువు వరకు స్టోన్ డస్ట్ పోసేందుకు రూ.50 వేలు కేటాయించారు. అదే విధంగా సద్దుల బతుకమ్మ వేడుకల నిర్వహణకోసం పట్టణంలో మొత్తం రూ.3.87 లక్షలు ఖర్చు చేసేందుకు సమావేశం ఆమోదించింది. 28 వార్డులలో ప్రత్యేక లైటింగ్, సౌండ్ సిస్టమ్ సౌకర్యం కోసం రూ.98 వేలు, బాణాపురం బతుకమ్మ మైదానం వద్ద లైటింగ్ కోసం రూ.95 వేలు, సూర్యాపేట రోడ్డులోని బతుకమ్మ కుంట వద్ద లైటింగ్, సౌండ్‌సిస్టమ్ కోసం రూ. 95 వేలు కేటాయించారు. అదే విధంగా బతుకమ్మ కుంట వద్ద స్టేజీ నిర్మాణం లైటింగ్, సౌండ్ సిస్టమ్ కోసం మరో రూ.99 వేలు కేటాయిస్తూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

అదేవిధంగా పట్టణంలో మునిసిపల్ వార్డులలో వివిధ అభివృద్ధి పనుల కోసం స్టేట్ ఫైనాన్స్ నిధులు రూ. 58.58 లక్షలు, ఎల్‌ఆర్ఎస్ నిధులు రూ.85 లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు. పట్టణంలోని 53/1 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూముల్లో దశాబ్దాల కాలంగా ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారి స్థలాలను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం క్రమబద్ధీకరించేందుకు కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా 20 మంది దినసరి కూలీలను తీసుకునేందుకు రూ.4 లక్షలు ఖర్చు చేసేందుకు నిర్ణయించారు.

పారిశుధ్యం, దోమల సమస్యలపై సభ్యుల ధ్వజం

జిల్లా కేంద్రంలో యేటా రూ. 1 కోటికి పైగా ఖర్చు చేస్తున్నప్పటికీ దోమల నివారణ సాధ్యం కావడం లేదని ఈ విషయమై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో పారిశుధ్యం పరిస్థితి పూర్తిగా క్షీణించిందని, పందులు స్వైరవిహారం చేస్తున్నాయని నిరసన వ్యక్తం చేశారు. వెంటనే పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచి ప్రజలను దోమల బారి నుంచి కాపాడాలని కోరారు. సమావేశంలో కమిషనర్ ఈశ్వరయ్య, వైస్ చైర్మన్ నాగారపు వెంకట్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో సకల సౌకర్యాలు కల్పిస్తాం

- ఖరీఫ్ సీజన్‌లో చిల్లర కాంటాలపై కఠిన చర్యలు
- రూ.1.63 కోట్లతో యార్డులో అభివృద్ధి పనులు
- మార్కెట్ చైర్‌పర్సన్ బండ పద్మయాదగిరిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ బండ పద్మ

జనగామ టౌన్: త్వరలో ప్రారంభం అయ్యే ఖరీఫ్ సీజన్‌లో జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రైతాంగ సేవలకు పకడ్బందీ చర్యలు చేపట్టడం జరుగుతుందని చైర్‌పర్సన్ బండ పద్మయాదగిరిరెడ్డి అన్నారు. జనగామ స్పెషల్ గ్రేడ్ మార్కెట్ యార్డ్‌లో మంగళవారం జరిగిన మార్కెట్ కమిటీ పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో బండ పద్మ ఆధ్యక్షత వహించి మాట్లాడారు. మార్కెట్ పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేల సహకారంతో జనగామ మార్కెట్ యార్డ్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంతమైన మార్కెట్ యార్డ్‌గా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం యార్డ్‌లో గోదాంలు, కవర్ షెడ్‌లు, ప్యాడీ డ్రయ్యర్, కాటన్ యార్డ్ తదితర సౌకర్యాలు కల్పించామని, మరో రూ.1.63 కోట్లతో ఆధునిక షెడ్, టాయిలెట్ బ్లాక్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. సీజన్‌లో యార్డ్‌కు సరుకులు తరలించే రైతులకు మార్కెటింగ్ అధికారులు సిబ్బంది పాలకవర్గం ఎల్లవేళలా అందుబాటులో వుండి పూర్తి సహకారం అందిస్తారన్నారు. మార్కెట్ యార్డ్‌కు ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకే సరుకులను అనుమతించాలని, యార్డ్‌లో నూతనంగా వేబ్రిడ్జి నిర్మించాలని, మార్కెట్ యార్డ్ పరిధిలో చిల్లర కాంటాలు నిరోధించి యార్డ్‌లోనే కొనుగోళ్లు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో మార్కెట్ కార్యదర్శి ఎన్.సంతోష్‌కుమార్, వైస్ చైర్మెన్ నామాల బుచ్చయ్య, డైరెక్టర్‌లు కూరగాయాల శ్రీను, ఉడుగుల భాగ్యమ్మ, రామచంద్రారెడ్డి, చాంద్ పాషా, మర్రి భాస్కర్‌రెడ్డి, రమేష్, రమాదేవి, ఉడుగుల నర్సింహులు, సూపర్ వైజర్లు ఖాజాపాషా, రమేష్ పాల్గొన్నారు.

వారంలోగా వ్యాక్సినేషన్ పూర్తి చేయాలి

డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి



మాట్లాడుతున్న అన్నప్రసన్న కుమారి

రఘునాథపల్లి రూరల్ : గ్రామాల్లో చేపడుతున్న మీజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వారం రోజుల్లోగా పూర్తి చేసి మళ్లీ సర్వే చేయాలని జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్న కుమారి అదేశించారు. మంగళవారం మండలంలోని కోమల్ల పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఏఎన్‌ఎంల సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మట్లాడారు. ఈ సందర్భంగా కోమల్ల పరిధిలోని 10 సబ్ సెంటర్‌ల వారీగా ఇప్పటి వరకు వేసిన వ్యాక్సినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అయితే మొత్తం 9436 మంది చిన్నారులున్నట్లు గుర్తించగా ఇప్పటి వరకు 81 శాతం అంటే 7422 మందికి ఈ వ్యాక్సిన్‌ను వేసినట్లు చెప్పారు. ఏఎన్ఎంలు ప్రతీ ఒక్కరు వారి వారి క్లస్టర్లలో నూరు శాతం వ్యాక్సిన్‌ను వారంలో లోగా పూర్తి చేసి ఒక్కరు కూడా తప్పిపోకుండా తిరిగి డోర్ టూ డోర్ సర్వే చేయాలని ఆమె ఆదేశించారు. నేటికీ దీనిపట్ల తల్లిదండ్రుల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల వారు పిల్లలను ఆస్పత్రికి తీసుకురావడం లేదని, ఆలాంటి వారికి తగిన అవగాహన కల్పించి ప్రతీ పిల్లవాడికి ఈ వ్యాక్సిన్ వేసేందుకు ఏఎన్ఎంలు కృషి చేయాలని సూచించారు. గుండె జబ్బులున్న వారికి, అదే విధంగా ప్రస్తుతం జ్వరంతో బాధపడుతున్న వారికి కూడా ఈ వ్యాక్సిన్ వేయవచ్చునని చెప్పారు. తప్పని సరిగా నూరు శాతం వ్యాక్సిన్ వేయాలని, అలా వేయని సిబ్బందిపై చర్యలు చేపడుతామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో కోమల్ల వైద్యాధికారి డాక్టర్ సుధీర్‌రెడ్డి, సీహెచ్‌వో రాణి, హెచ్‌ఈవో రామ్మూర్తి, సబ్‌సెంటర్ల ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌పై ఉపాధ్యాయుల ఉద్యమం

- అమలుకు నిరసనగా 1న సామూహిక సెలవులు
- పాత పద్ధతినే పునరుద్ధరించాలని డిమాండ్

కొడకండ్ల : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పెట్టాలని తెలంగాణ కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు నేతి కొండయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ఏడనూతుల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో టీసీపీఈఏ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులంతా సెప్టెంబర్ 1న సామూహిక సెలవును కోరుతూ చీటీని ప్రధానోపాధ్యాయురాలు కె.రాజపద్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న జిల్లా కేంద్రాల్లో నిరసనలు వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు అందరూ ఆరోజు జనగామకు తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో కొలిపాక సోమయ్య, ఎస్ అంజయ్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

దేవరుప్పుల: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం ప్రతినిధి రాపాక లక్ష్మణ్ కోరారు. మంగళశారం మండలంలోని కోలుకొండలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన సీపీఎస్ విధానంతో ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందన్నారు. పెన్షన్ భిక్ష కాదు- ఉద్యోగుల హక్కు అని ఇది సాధించేంత వరకు పోరాటాలు ఆపమని హెచ్చరించారు. కార్యక్రమంలో కందుల శ్రీనివాస్, ధరావత్ రాములు, పోకల రవీందర్, వనమాల సతీష్, నవీన్, రాంజేందర్ కుమార్, వరప్రసాద్, శ్రీకాంత్, రజితాదేవి, రమాదేవి, రాజ్యలక్ష్మీ, వరలక్ష్మీ, స్వప్న, మాధవి, శ్రీవణ్య, మంజుల, మహేందర్, భారతమ్మ, భద్రయ్య, తిరుపతయ్య, సంధ్యారాణి, లక్ష్మీకాంతమ్మ, ఖాదర్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



కోలుకొండలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

వెంకన్న సన్నిధిలో సీపీ పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న సీపీ సుధీర్‌బాబు

చిలుపూర్ : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ గొట్టె సుధీర్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం దేవాలయానికి చేరుకున్న సీపీకి ఆలయ కార్యనిర్వాహణ అధికారి చెరుకు జయశంకర్, ప్రధాన అర్చకుడు సౌమిత్రి శ్రవణకుమారాచార్యులు ఘనస్వాగతం పలికారు. వేదమంత్రాల మధ్య అర్చన అభిషేకం చేసి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం కండువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ మూల నాగరాజు, రవిశర్మలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాసర్ల పూర్ణిమకు 'తెలంగాణ రత్న అవార్డు'



జనగామ కల్చరల్: స్త్రీ శిశు సంక్షేమ శాఖ బైరాన్‌పల్లి సెక్టార్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జనగామ జిల్లా కేంద్రానికి చెందిన కాసర్ల పూర్ణిమను 'తెలంగాణ రత్న' అవార్డు వరించింది. వివిధ సామాజిక రంగాలలో సేవలందిస్తున్నందుకు గాను విశాఖ పట్టణానికి చెందిన అర్పిత సేవాసంస్థ ఆమెను ఈ అవార్డుకు ఎంపికచేసింది. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను విజయవంతం చేస్తూ, వివిధ సామాజిక రంగాలలో సేవలందించే వారికి అర్పిత సంస్కృతిక, సామాజిక సేవా సంస్థ యేటా ఈ అవార్డులు ప్రదానం చేస్తోంది. సెప్టెంబర్‌లో వైజాగ్‌లో జరిగే కార్యక్రమంలో సినీప్రముఖులు, రచయితలు, విద్యావేత్తలు పాల్గొనే కార్యక్రమంలో పూర్ణిమ ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా పూర్ణిమను పలువురు అభినందించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నునావత్ లక్ష్మణ్(ఫైల్)

నర్మెట: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బొమ్మకూర్ శివారు రాళ్లబాయితండాలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం రాళ్లబాయితండాకు చెందిన నునావత్ లక్ష్మణ్(40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండు సంవత్సరాల నుంచి పంటలు సక్రమంగా పండలేదు. ఈ క్రమంలో అప్పులు పెరిగాయి. కాగా, అప్పులు తీర్చే మార్గం లేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య అంబాలి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈవిషయమై ఎస్సై వీరభద్రరావును సంప్రదించగా ఫిర్యాదు అందలేదన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరి మృతి


కనకయ్య (ఫైల్)

బచ్చన్నపేట: బచ్చన్నపేట, ఆలీంపూర్ గ్రామాల మధ్య శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పండుగ కనకయ్య (35) మంగళవారం మృతి చెందాడు. జనగామ నుంచి బైక్‌పై బావమరిది మహేందర్‌తో కలిసి స్వగ్రామం నాగిరెడ్డిపల్లికి వస్తుండగా ఆగివున్న లారీని వెనుక వైపు ఢీకొట్టారు. ఈ ఘటనలో మహేందర్ అక్కడికక్కడే మృతి చెందగా, కనకయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, భార్య కవిత తీవ్ర అనారోగ్యంతో కొంత కాలంగా బాధపడుతుండగా, భర్త కనకయ్య మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రభుత్వం తరుపున బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు కృషి చేయనున్నట్లు సర్పంచ్ గొల్లపల్లి అంజనేయులుగౌడ్ తెలిపారు.

చిలుపూర్‌లో...

చిలుపూర్ : పదిరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలోని జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు - కారు ఢీకొన్న సంఘటనలో వరంగల్‌కు చెందిన చింతనూరి పవన్‌కుమార్ (24)కు తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

జనగామ టౌన్: జిల్లా కేంద్రంలోని ఒక దినపత్రిక కార్యాలయంలో అసిస్టెంట్ సర్క్యులేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పీసు వెంకన్న(35) మంగళవారం జనగామ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి దుర్మరణం చెందాడు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారానికి చెందిన వెంకన్న కొన్నాళ్లు జనగామలో ఏసీవోగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. జనగామకు వచ్చిన వెంకన్న గుర్తు తెలియని రైలులో వరంగల్ వైపు వెళ్తు ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని రాత్రి గుర్తించి పోస్టుమార్టం కోసం తరలించారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

జనగామ టౌన్: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఏరియా ఆస్పత్రిలో నిర్లక్ష్యంగా చికిత్స అందిస్తున్నారంటూ మంగళవారం బంధువులు ఆందోళన చేశారు. నర్మెట మండలం మాన్‌సింగ్ తండాకు చెందిన అంగోత్ సంతోష్ మంగళవారం తెల్లవారుజామున క్రిమిసంహారక మందు తాగగా కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు సకాలంలో పట్టించుకోలేదని ఇంజక్షన్లు ఇచ్చిన తరువాత విద్యార్థి ఆరోగ్య పరిస్థితి క్షీణించి పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడని, వైద్యం వికటించిందని బంధువులు ఆందోళన చేశారు. కాగా, ఈ విషయమై డ్యూటీ డాక్టర్ శ్రీనివాస్ వివరణ ఇస్తూ చికిత్సల్లో నిర్లక్ష్యం లేదని, కొన్ని ఇంజెక్షన్లతో మత్తుగా ఉంటుందని, విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

సమ్మె బాటలో సాక్షరభారత్ కో- ఆర్డినేటర్లు

వేతనం పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్


జనగామలో సమ్మె నోటీసు అందజేస్తున్న సాక్షరభారత్ కో- ఆర్డినేటర్లు

జనగామ రూరల్ : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సాక్షరభారత్ కో-ఆర్డినేటర్ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నుంచి సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్నివారు అందజేశారు. ఈ సందర్భంగా సాక్షరభారత్ మండల కమిటీ అధ్యక్షుడు పెండ్యాల అంజనేయులు మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా చాలీ, చాలని వేతనాలతో అర్హతలతో గడుపుతూ వయోజనులకు విద్యను నేర్పించామన్నారు. అంతే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. శ్రమకు తగిన ఫలితం లేకుండా పోయిందని ఆందోళన చెందారు. ప్రభుత్వం తమ శ్రమను గుర్తించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ పోగుల చంద్రారెడ్డి, గ్రామ కో-ఆర్డినేటర్లు యాకూబ్, ప్రేమలత, పి.నర్సింహస్వామి, భైరు ఉప్పలయ్య, కనకాచారి, రామనర్సమ్మ, జ్యోతి, శ్రీలత, సునీత, హేమదేవి, అనిత పాల్గొన్నారు.

నర్మెటలో...

నర్మెట: అతి తక్కువ వేతనాలతో గ్రామ, మండల స్థాయిలో సేవలు అందిస్తున్న సాక్షర భారత్ కో ఆర్డినేటర్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని సాక్షర భారత్ మండల కో-ఆర్డినేటర్ సింగారపు భాగ్యలక్ష్మి అన్నారు. సాక్షరభారత్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 30 నుంచి 31 తేదీ వరకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టె సమ్మె నోటీసును పర్యవేక్షణ అధికారి శ్రీనివాస్‌కు అందించారు. కార్యక్రమంలో సాక్షరభారత్ కో-ఆర్డినేటర్లు నాగపూరి రాజు, పుట్ట నర్సింహులు, లత, మహేశ్వరి, రేణుక, జ్యోతి, మంజుల, రమేష్, మోహన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో...

బచ్చన్నపేట : గ్రామ, మండల స్థాయిలో పని చేసే సాక్షరభారత్ సమన్వయకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ 29 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు మంగళవారం ప్రకటించారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు నిరవధిక సమ్మె చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సాక్షరభారత్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బియ్యం దందాలో 8 మందిపై కేసులు

జనగామ టౌన్: జిల్లా కేంద్రంలో పీడీఎస్ బియ్యం అక్రమ దందాకు పాల్పడుతున్న 8 మందిపై కేసులు నమోదుచేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన వ్యాపారులు, జనగామలో సాయికృప రైస్ ట్రేడర్స్ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేసుకొని జనగామ, సూర్యాపేట, యాదాద్రి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో అక్రమంగా పీడీఎస్ బియ్యం అక్రమ దందాకు పాల్పడుతున్నారు. కాగా, పీడీఎస్ యాక్ట్ ప్రకారం ఇమ్మడి సోమనర్సయ్య, మెతుకు సందీప్, సూర్యదేవరశేఖర్, కస్తూరి ప్రభాకర్, ఇమ్మడి అంజయ్య, ఈరంటి సాయి కృష్ణ, పి.తిరుమలేశ్‌లపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దిల్‌రాజు పీఏలకు గాయాలు

రఘునాథపల్లి రూరల్ : హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై మండలంలోని నిడిగొండ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజ్ పీఏగా పనిచేస్తున్న ప్రసాద్, శ్రీధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరు హైదరాబాద్ నుంచి పర్వతగిరి గ్రామానికి షార్ట్ ఫిలిం షూటింగ్ నిమిత్తం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన వారిని 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్‌రావు తెలిపారు.

బ్లాక్ బెల్ట్ షోడాన్ కైవసం

రఘునాథపల్లి: స్టాండర్డ్ షిట్ ర్యూ ఇంటర్నేషనల్ కరాటే-డోకాయ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో రఘునాథపల్లి మండలం పత్తేపూరం గ్రామానికి చెందిన గడ్డం శ్రీను అత్యంత ప్రతిభ కనబరచి బ్లాక్ బెల్ట్- షోడాన్ కైవసం చేసుకున్నారు. కాగా, సర్పంచ్ సత్యనారాయణ, చీఫ్ ఎగ్జామినర్ రాము, ఇన్‌స్ట్రక్టర్ అలీమ్ తదితరులు అభినందించారు.

అద్దాలు పగిలి ఇద్దరికి గాయాలు

జనగామ టౌన్: జనగామ పట్టణంలోని ఓ ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్ అద్దాలు పగిలి ఓ నిండు గర్భిణితో పాటు మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. యాదాద్రి జిల్లా యాదగిరిగుట్ట మండలం కందుకూర్‌కు చెందిన నిండు గర్భిణీ మమత ఆమె తల్లి లక్ష్మీలు పరీక్షల కోసం విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌కు వచ్చి బయట వేచి ఉన్నారు. సెంటర్‌పై అంతస్తులో అద్దాలు శుభ్రం చేస్తుండగా పగిలి ఇద్దరిపైనా పడ్డాయి. దీంతో గర్భిణీతో పాటు ఆమె తల్లికి తీవ్రగాయాలు కాగా 108 ద్వారా ఏరియా ఆస్పత్రికి తరలించారు. సెంటర్ నిర్వాహకుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పేకాట రాయుళ్లకు జైలు శిక్ష

పాలకుర్తి: జనగామ మెజిస్ట్రేట్ ఏడుగురికి ఏడురోజులు జైలు శిక్ష విధించారని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వారం రోజుల క్రితం బొమ్మెర గ్రామంలో పేకాట ఆడుతుండగా వంజాల రవి, బైర గాని యాకయ్య, మారబెల్లి యాకయ్య, బోడ రాకేశ్, వంగాల ప్రశాంత్, రోడ్డ లక్ష్మణ్, బి.పరుశురాములకు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

'ఎంబీసీ జిల్లా సదస్సును జయప్రదం చేయాలి'

నర్మెట: ఈ నెల 31న జిల్లా కేంద్రంలోని జూబ్లీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ఎంబీసీ జిల్లా సదస్సుకు మండలంలోని ఎంబీసీలందరు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎంబీసీ సంఘం జిల్లా కన్వీనర్ సాంబరాజు యాదగిరి పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 71 సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధికి ఆమడ దూరంలో ఎంబీసీలు ఉన్నారన్నారు. ప్రభుత్వ బడ్జెట్ సంక్షేమ పథకాల్లో ఎంబీసీలకు న్యాయమైన వాటా దక్కాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే జిల్లా సదస్సుకు ఎంబీసీలు అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజ్ఞాపురం అంజయ్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మారినా రోడ్లు మారలేదు..

- గుంతల మయంగా తండా రోడ్లు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు


బీల్య తండాకు వెళ్లే మట్టి రోడ్డు


దేశ్యతండా రోడ్డులోని కల్వర్టు

తరిగొప్పుల: మండల పరిధిలో మొత్తం 32 తండాలు కలవు. ఇందులో బీల్య తండా, దేశ్య తండాలకు ఇప్పటికీ బీటీ రోడ్లు మంజూరు కాలేదు. ఇప్పటికీ తండావాసులు మండల కేంద్రానికి రావడానికి మట్టి రోడ్లపైనే ప్రయాణం కొనసాగిస్తున్నారు. అవిభాజ్య వరంగల్ జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు తండాలను పట్టించుకుకోకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయి. కొత్త జిల్లాలు ఏర్పడిన అనంతరం తరిగొప్పుల జనగామ జిల్లాలో నూతన మండలంగా ఏర్పాటైంది. దీంతో తండాల ప్రజలు బీటీ రోడ్డుపై ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్లు గుంతల మయంగా మారాయి. దేశ్యాతండా నుంచి అంకుషాపూర్ వెళ్లే దారిలోని కల్వర్టులో వర్షాకాలం నీరు నిలిచి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి మండల కేంద్రానికి చేరుకోవడానికి తక్కువ సమయం పడుతుందని ఆశపడుతున్నారు.

- నడవడం కష్టంగా ఉంది ..

లావుడ్య రఘు, దేశ్యాతండ



వర్షాకాలం వస్తే తండా నుంచి అంకుషాపూర్ గ్రామానికి వెళ్లాలంటే నడవడమే చాలా కష్టంగా ఉంది. ఏ అర్ధరాత్రో పామో... తేలో కుడితే బాధితుడిని మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించాలంటే 5 కిలోమీటర్ల దూరానికి గంట పడుతుంది. దయచేసి అధికారులు స్పదించి బీటీ రోడ్లు నిర్మించాలని కోరుతున్నాం.

ఇంటర్వ్యూ..

'అన్ని పాఠశాలల్లో త్రీఆర్స్ నిర్వహిస్తున్నాం'


ఎం.రవికుమార్, ఎంఈవో, దేవరుప్పుల

ప్ర: పాఠశాలల్లో త్రీఆర్స్ నిర్వహిస్తున్నారా?

జ: మండలంలోని అన్ని పాఠశాలల్లో త్రీఆర్స్ నిర్వహిస్తున్నాం. మధ్యాహ్నం లంచ్ తర్వాత ఒకటి నుంచి 9తరగతుల వరకు తెలుగు, ఆంగ్లం, గణితంపై చదవడం, రాయడం నేర్పిస్తున్నాం.

ప్ర: మధ్యాహ్న భోజన బిల్లు చెల్లింపులు చేస్తున్నారా?

జ: జూలై మాసం వరకు మధ్యాహ్న భోజన బిల్లు చెల్లింపులు చేశాం.

ప్ర: ఉపాధ్యాయులు కొరత ఉన్న పాఠశాలల్లో ఏమైనా సర్దుబాటు చేశారా?

జ: ఆరు పాఠశాలల్లో 6గురు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం. జడ్పీ ధర్మాపురం, దేవరుప్పుల, కామారెడ్డిగూడెం, దేవరుప్పుల పీఎస్, బస్‌స్టేజీ పీఎస్, సింగరాజుపల్లి పీఎస్‌లలో నియమించాం.

-దేవరుప్పుల

జాగృతి మండల మహిళా కన్వీనర్‌గా కావ్యశ్రీ



బచ్చన్నపేట: జాగృతి మండల కన్వీనర్‌గా చిన్న రామన్‌చర్ల గ్రామానికి చెందిన పిన్నింటి కావ్యశ్రీని నియమించినట్లు నియోజకవర్గ కన్వీనర్ బాల్నె సత్యనారాయణ తెలిపారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎంపీ కవితకు రాష్ట్ర, జిల్లా నాయకులు చరణ్, పసునూరి మురళి, గంగాధర్‌లకు కావ్యశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. సెప్టెంబర్ 2న జిల్లా కేంద్రంలో నిర్వహించే కవితాంజలి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయనున్నట్టు వివరించారు.

కాంగ్రెస్ నిడిగొండ అధ్యక్షుడిగా రామాంజనేయులు

రఘునాథపల్లి రూరల్ : కాంగ్రెస్ నిడిగొండ అధ్యక్షుడిగా బిర్రు రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద రమేష్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ప్రధానకార్యదర్శిగా కోళ సత్యనారాయణ, సహాయకార్యదర్శిగా దేవర ఇస్తారి, కోశాధికారిగా పెద్దగోని సత్యనారారాయణ ఎంపికయ్యారు.

నేడు డయల్ యువర్ డీఎం

జనగామ టౌన్: జనగామ ఆర్టీసీ డిపోలో ఈ నెల 30న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించబడునని డిపో మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని అన్నారు. డిపో పరిధిలోని గ్రామాల ప్రజలు, ప్రయాణికులు సెల్ నెంబర్ 9959226050కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందించాలన్నారు.

బహుజన వికాస సమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా దశరథం

జనగామ టౌన్: బహుజన వికాస సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీగా జనగామ జిల్లా గుండాల మండల కేంద్రానికి చెందిన సిరిపురం దశరథంని నియమించినట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ తెలిపారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీతో పాటు ధశరథం సమితి రాష్ట్ర ప్రదాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తారన్నారు. ఎస్టీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వికలాంగ, అగ్రకుల పేదల చేయూత లక్ష్యంగా బహుజన వికాస సమితి పోరాడుతుందన్నారు.

'గణేష్ నిమజ్జనంలో దేశభక్తి చాటిచెప్పాలి'

జనగామ టౌన్: జిల్లాలో జరిగే గణేష్ నిమజ్జన ఉత్సవాలను దేశభక్తిని చాటిచెప్పే విధంగా నిమజ్జనం చేయాలని ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ కొత్తూరి వాసు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో జరిగిన గణేష్ ఉత్సవ సమితి సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. నిమజ్జనంలో సంస్కృతి సంప్రదాయాలు, ఇనుమడింపజేయాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు రవీందర్, లోకుంట్ల ప్రవీణ్, మూర్త వీరేందర్, నర్సింగ్, అర్జున్, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

'గ్రామీణ విద్యార్థుల ప్రతిభ అసాధారణం'


విద్యార్థులకు పంపిణీ చేసిన పుస్తకాలతో ఎన్ఆర్ఐ వంశీధర్‌రెడ్డి

రఘునాథపల్లి రూరల్ : గ్రామీణ విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలు ఎక్కువగా ఉంటాయని, ఎన్ఆర్ఐ గుడి వంశీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాదారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులందరికి పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ తరగతిలో మొదటి ర్యాంకు సాధించే విద్యార్థులందరిని ఉచితంగా చదువు చెప్పిస్తానని, వీరిని ప్రోత్సహిస్తే ఉన్నత స్థానాల్లో ఉంటారని అన్నారు. అదే విధంగా తన శక్తి మేరకు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిచేసి తీరుతానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా నాయకులు చేవెల్లి సంపత్, స్థానిక ఎస్సై రంజిత్ రావు, ఉపాధ్యాయుడు సంపత్ కుమార్, బాల్నె శ్రీనివాస్, వార్డు సభ్యులు విజయలక్ష్మి, నర్సింహా, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు


కబడ్డీ ఆడుతున్నవిద్యార్థులు

చిలుపూర్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్14, 17 విభాగానికి సంబంధించి క్రీడాకారుల ఎంపిక పోటీలు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎంపిక పోటీలను స్థానిక ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రారెడ్డితో కలిసి మండల విద్యాశాఖ అధికారి టీ. లక్ష్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. మండలంలోని తొమ్మిది గ్రామాలకు చెందిన పాఠశాలలతో పాటు మూడు ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారని వివరించారు. మండలంలోని లింగంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదవరెడ్డి విద్యార్థుల కోసం ఉచితంగా క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు శైలేందర్ సింగ్, సదానందం, దిలీప్‌కుమార్, సుమలత, కిరణ్, శ్రీనివాస్‌రావు, విజేందర్ రెడ్డి, హిమాద్రి, శైలజ, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన ఉద్యోగుల సమ్మె

జనగామ టౌన్: జిల్లా కేంద్రంలో సెర్ప్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారించాలని ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళవారం 14వ రోజు కొనసాగింది. ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని ప్రతిజ్ఞలు చేశారు. ఆందోళనలో రజియాబేగం, యాదగిరి, మల్లిక, శోభ, యాదమ్మ, గోపమ్మ పాల్గొన్నారు.

ఘనంగా పారామెడికల్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే



సమావేశంలో మాట్లాడుతున్న దశమంతరెడ్డి

జనగామ ఎడ్యుకేషన్: ప్రతీ విద్యార్థి సేవాభావాన్ని అలవర్చుకోవాలని జిల్లా సాధన జేఏసీ చైర్మన్ ఆరుట్ల దశమంత రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పారామెడికల్ కళాశాల విద్యార్థుల ప్రెషర్స్ డే పార్టీకి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకున్నప్పుడే చదివిన చదువుకు సార్థకత దక్కుతుందన్నారు. అనంతరం సిద్దార్థ పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మినారాయణ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన వైద్యంపై అవగాహన పెంచుతున్నామన్నారు. కొన్ని రోజుల్లో గ్రామాల్లో ప్రథమ చికిత్స చేసేందుకు శిక్షణ పొందిన విద్యార్థులచే వైద్యం చేపిస్తామన్నారు. ప్రభుత్వం పారామెడికల్ చదివిన వారికి అవకాశం కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించేవరకు పట్టు వీడకూడదు : సీఐ ముస్కె శ్రీనివాస్

ప్రతీ విద్యార్థి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేవరకు పట్టు వీడకూడదని జనగామ సీఐ ముస్కె శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏబీవీ డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రెషర్స్ డే పార్టీలో ముఖ్య అతిథిగా సీఐ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. చదువుతో పాటు విద్యార్థుల్లో క్రమశక్షణ పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు అధ్యాపకులు నిర్విరామంగా కృషిచేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మిసత్యవతి మాట్లాడుతూ కళాశాలలో ఉత్తమ విద్యనందించేందుకు నైపుణ్యంతో కూడన అధ్యాపక బృందం ఉందని అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అలరింపజేశాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిష్టియాన, ఎన్‌సీసీ విభాగ లెఫ్టినెంట్ సుకుమార్, చీటూరి నర్సింహులు, సోమన్న పాల్గొన్నారు.

రైతులను అగ్రభాగాన నిలపడమే ప్రభుత్వ లక్ష్యం

టీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి మారజోడు రాంబాబు

రఘునాథపల్లి: అన్నదాతలను అగ్రభాగాన నిలుపడమే ప్రభుత్వ లక్ష్యమని టీఆర్ఎస్ మండల ఇన్‌చార్జీ మారజోడు రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు చేకూర్చాలనే కేసీఆర్ భూ సమగ్ర సర్వే విధానానికి శ్రీకారం చూట్టారన్నారు. అందులో భాగంగానే గ్రామ రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. గ్రామ రైతు సమన్వయ సమితిలను 15 మంది రైతులతో, మండల రైతు సమన్వయ సమితిలను 24 మంది రైతులతో, జిల్లా సమన్వయ సమితిలను 42 మంది రైతులతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమితి సభ్యులు ప్రభుత్వానికి, రైతులకు అనుసంధానంగా ఉండేట్టు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమన్వయ సమితిలను సెప్టెంబర్ 1 నుంచి 9వరకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతుల కష్టసుఖాలను తెలుసుకోవడానికి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య రైతు పల్లె నిద్ర కార్యక్రమానికి శ్రీకారం చూడుతున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రైతులు అంకిత భావంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, శ్రీనివాస్, శివకుమార్, మహేష్, సునీత, రాజు, మధు, శ్రావణ్‌కుమార్, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

డీటీకి సాక్షరభారత్ కోఆర్డినేటర్ల సమ్మె నోటీస్

లింగాలఘణపురం: సాక్షరభారత్ కోఆర్డినేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేయడంతో పాటుగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు తాము విధులకు దూరంగా ఉంటున్నట్లు మంగళవారం డిప్యూటీ తహసిల్దార్ లక్ష్మినారాయణకు సమ్మెనోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ వాణితో పాటుగా వీసీవోలు మాట్లాడుతూ సాక్షరభారత్ కోఆర్డినేటర్లకు వేతనాలను పెంచాలని, అన్ని గ్రామాల్లోని కేంద్రాలను లైబ్రరీలుగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీసీవోలు యాదగిరి, పద్మ, నాగమణి, సోమన్న, ఎల్లయ్య, అనిత, కృష్ణ, పర్శరాములు, సువార్త, నాగేశ్ భవాని తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

'గుడుంబా తయారీ మానేసిన వారికి ప్రభుత్వ రుణాలు'



పద్మ, ఎక్సైజ్ ఎస్సై, పాలకుర్తి

ప్ర : మండలంలో గుడుంబా నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టారు ?

జ : మండలంలోని అన్ని గ్రామాల్లో గుడుంబా నియంత్రణ కోసం తయారీదారులకు పలు సార్లు కౌన్సిలింగ్ ఇచ్చాం.

ప్ర : ఎంత మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు ?

జ : మొత్తం 43 మందిని ఎంపిక చేయగా పాలకుర్తిలో 23 మందిని ఎంపిక చేశాం.

ప్ర : పాలకుర్తి స్టేషన్ పరిధిలో ఏ ఏ మండలాలు వస్తాయి ?

జ : పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల, జఫర్‌గడ్ మండలాలున్నాయి.

ప్ర : ఈ మండలాల్లో గుడుంబా నియంత్రణ సంపూర్ణంగా జరిగిందా ?

జ : ఈ నాలుగు మండలాల్లో వంద శాతం గుడుంబా నియంత్రణ జరిగింది.

ప్ర : గుడుంబా మానేసిన వారికి ఎలాంటి ఉపాధి ఆవకాశాలు కల్పించారు ?

జ : గొర్రెలు, గేదెలు, జనరల్ స్టోర్, ఆటోలకు రుణాలు ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం.

- పాలకుర్తి

కాంగ్రెస్‌లో చేరికలు

పాలకుర్తి : మండలంలోని సిరిసన్నగూడెం శివారు కంబాలకుంటతండాకు చెందిన టీఆర్ఎస్ నాయకులు 50 మంది వివేకానందా యూత్ అధ్యక్షుడు బానోతు అనిల్ ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. చేరినవారిలో బానోతు సురేష్, రాజు, నరేష్, యాకన్నలతో మరి కొంత మంది ఉన్నారు. కార్యక్రమంలో చారగొండ్ల సత్తయ్య, మల్లారెడ్డి, రాపాక సత్యనారాయణ, పెంట య్యా తదితరులున్నారు.

'మాతృ భాషను కాపాడుకోవాలి'

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: భాషా పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆదిత్య హైస్కూల్ కరస్పాండెంట్ గూడ సునిత కోరారు. మంగళవారం తెలుగు భాషా దినోత్సవం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రమేశ్,యాకూబ్‌పాష, శోభన్, మధు, నరేష్, లక్ష్మణ్, రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురికి నీరు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: శివునిపల్లి పటణ వివేకానంద చౌరస్తా సమీపంలో ఉండే రోడ్డుపై మురికి నీరు పారుతుండడంతో జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. పంచాయతీ సిబ్బంది గమనించాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలల మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి

జిల్లాలో 210 అదనపు తరగతి గదుల మంజూరు

శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను పరిశీలించిన డీఈవో



చీటూరులో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

లింగాలఘణపురం: ఉన్నత విద్యా ప్రమాణాలు, ఉత్తమ విద్యాబోధన అందించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి నేతృత్వంలో పాఠశాలల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిని కేటాయించింది. ఈ మేరకు జిల్లాలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలపై ఏప్రిల్ మాసంలో సర్వశిక్షఅభియాన్ ఆధ్వర్యంలో 20 రోజుల పాటు జిల్లాలోని 536 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో జిల్లా పరిధిలోని 99 పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నట్లు సర్వే పరిశీలనలో తేలింది. దీంతో జనగామ జిల్లాలో 210 అదనపు తరగతి గదులను సర్వ శిక్ష అభియాన్ ద్వారా కొత్తగా నిర్మించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లాలోని లింగాలఘణపురం మండలం చీటూరు ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు భవనాన్ని జనగామ విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య స్థానిక ఎంఈవో చంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. లింగాలఘణపురం మండలంలో కొత్తపల్లి, చీటూరు, నాగారం, గుమ్మడవెల్లి, లింగాలఘణపురం పీఎస్‌లతో పాటుగా లింగాలఘణపురం హైస్కూల్లో అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. ప్రభుత్వం జిల్లాలోని 13 మండలాల పరిధిలో 76 పీఎస్ యూపీఎస్ పాఠశాలల్లో 139 అదనపు తరగతి గదులు, 23 జడ్పీ హైస్కూళ్ల పరిధిలో 81 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. పీఎస్ యూపీఎస్ పాఠశాలలు గుండాల మండలంలో 10, తరిగొప్పులలో 6, చిల్పూరులో 5, జఫర్‌ఘడ్‌లో 2, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 7, రఘునాథపల్లిలో 5, నర్మెటలో 3, జనగాంలో 4, లింగాలఘణపురంలో 5, దేవరుప్పులలో 7, పాలకుర్తిలో 10, కొడకండ్లలో 4 గదుల చొప్పున 139 అదనపు తరగతి గదులను మంజూరు చేసింది. జడ్పీ హైస్కూళ్లకు బచ్చన్నపేటలో 3, చిల్పూరులో 2, దేవరుప్పులలో 3, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 3, కొడకండ్లలో 1, లింగాలఘణపురంలో 1, నర్మెటలో 2, పాలకుర్తిలో 2, రఘునాథపల్లిలో 4, తరిగొప్పులలో 1, జఫర్‌గడ్‌లో 1 పాఠశాల చొప్పున మొత్తం 81 అదనపు తరగతి గదులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. వీటితో పాటుగా జిల్లాలోని మరో 59 పాఠశాలల తరగతి గదులను మేజర్ రిపేర్‌ల కింద గుర్తిస్తూ వాటిని కూడా మరమ్మతు చేసేందుకు అధికారులు అవసరమైన చర్యలను చేపట్టారు. ఈ నేపథ్యంలో డీఈవో యాదయ్య మంగళవారం లింగాలఘణపురం మండలం చీటూరు పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న స్థితిగతులను పంరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో హరితహారం కార్యక్రమాన్ని పరిశీలించి నూరు శాతం హరితహారం చేపట్టి వాటిని సంరక్షించడంలో ఉపాధ్యాయుల చొరవను డీఈవో అభినందించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. డీఈవో వెంట ఎంఈవో చంద్రారెడ్డి, హైస్కూల్ హెడ్మాష్టర్ శంకర్‌రెడ్డి ఉన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో మీజిల్స్ రుబెల్లా టీకాల పంపిణీ



మీజిల్స్ రుబెల్లా టీకాలు ఇప్పిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: మీజిల్స్ రుబెల్లా టీకాల కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. స్టేషన్ ఘన్‌పూర్ సెయింట్ థామస్ స్కూల్, శివునిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో టీకాలు వేసుకోని పిల్లలను గుర్తించి టీకాలు ఇచ్చారు. కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ కేసీ జాన్‌బన్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు 9 నెలల నుంచి 15 ఏళ్ల పిల్లలకు ఈ టీకాలు ఇప్పించాలని కోరారు. సెప్టెంబర్ 25 వరకు టీకాల పంపిణీ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.కరుణాకర్, క్లబ్ బాధ్యులు ఇవాన్ బన్నీ, ఎం.ఉపేందర్, పాలకుర్తి సోమశేఖర్, పి.వెంకటేశం, జి.సంపత్, ఎ.మధు, గోలి శ్రీను, వెంకటేశ్వర్లు, కృష్ణ, కె.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల్లో అన్నదానం



అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న సీఐ నరేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని సీఐ ఆర్.నరేందర్ అన్నారు. మండల కేంద్రంలో శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం గొప్పదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ భూక్య స్వామినాయక్, సింగిల్‌విండో చైర్మన్ గట్టు రమేష్, సర్పంచ్ ఇల్లందుల ప్రతాప్, ఎంపీటీసీలు డాక్టర్ అంబటి సత్యనారాయణరాజు, గోనెల ఉపేందర్, యూత్ అధ్యక్షుడు నీల సుమత్, ప్రధాన కార్యదర్శి నీల అశోక్, వార్డు సభ్యుడు శ్రీధర్, నీల గట్టుయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

'శ్మశాన వాటిక పనులను త్వరగా పూర్తి చేయాలి'

జఫర్‌గడ్ : శ్మశాన వాటిక నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ కన్సల్టెంట్(ఈసీ) సింగపురం కిరణ్‌కుమార్ అన్నారు. రూ. 10 లక్షల ఈజీఎస్ నిధులతో మండలంలోని తిడుగు గ్రామంలో నిర్మిస్తున్న శ్మశాన వాటిక నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రభుత్వం ఈజీఎస్ నుంచి నిధులు విడుదల చేసిందన్నారు. శ్మశాన వాటికల అభివృద్ధికి గ్రామ ప్రజలు సహకరించారని అన్నారు. ఆయన వెంట ఎఫ్ఎ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ 1న సామూహిక ధర్నా



ధర్నా పోస్టర్ విడుదల చేస్తున్న టీఎన్‌జీవో నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేసి రాష్ట్రంలో లక్షా 20 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయుల పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రతను కాపాడాలని డిమాండ్ చేస్తు సెప్టెంబర్ 1న నిర్వహించే సామూహిక ధర్నా విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి గడ్డం శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఘన్‌పూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1న ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరూ సెలవు పెట్టి కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు తరలి రావాలన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు ఎ.సతీష్, యాతం రమేశ్, సుధాకర్, ఓంకార్, కృష్ణమోహన్, దస్తగిరి పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేసిన టీఎన్‌జీవో నేతలు..

1న సామూహిక సెలవు, కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని టీఎన్‌జీవో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఎస్ రద్దు పోరాటంలో భాగంగా జీఎన్‌జీవో జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో నేతలు కిషన్‌రావు, వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి, శోభ తదితరులు పాల్గొన్నారు.

'కనీస సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి'

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: ఉపాధ్యాయులు విద్యార్థుల కనీస సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ బాలుర హైస్కూల్ హెచ్‌ఎం కె.విజయ అన్నారు. మంగళవారం నమిలిగొండ యూపీఎస్‌లో ఆమె త్రీ ఆర్స్ కార్యక్రమాన్ని పరిశీలించారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టుల్లో చదవడం, రాయడం, చతుర్విధ పరిక్రియలు నిర్వహిస్తున్న తీరును హెచ్‌ఎం తనిఖీ చేశారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో చేసే తప్పులను ఎప్పటికప్పుడు సరిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కుసుమ రమేశ్, సీఆర్‌పీ పి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పద్మ, మురళీధర్, శోభారాణి, సారంగపాణి, వై.రమేశ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎంపీపీ స్వరూప

జఫర్‌గడ్ : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ గుజ్జరి స్వరూప అన్నారు. మండలంలోని ఉప్పుగల్లు, వెంకటాపూర్, గర్మిళ్ళపల్లి గ్రామాల్లో నిర్వహించిన రైతు సమన్వయ కమిటీల ఎంపిక కార్యక్రమానికి సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రానున్న ఖరీఫ్ నుంచి ఎకరాకు రూ. 8 వేల ఉచిత పెట్టుబడి ఇవ్వనుందన్నారు. ఇందుకు ప్రతీ రెవెన్యూ గ్రామం నుంచి 15 మందిని రైతు సమన్వయ కమిటీ సభ్యులుగా ఎంపిక చేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి రైతు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పి.రవి, ఎల్.లలిత, జి.చిరంజీవి, ఎంపీటీసీలు జి.మణెమ్మ, కో.లక్ష్మి, ఎం.శ్రీనివాస్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె.కనకయ్య, ఎల్లయ్య, జి.రాజు, ప్రేమ్‌దాస్, స్వామినాయక్, కె.నర్సింగం, రమేష్ పాల్గొన్నారు.

'కనీస వేతన చట్టం కోసం కార్మికులు ఉద్యమించాలి'

జఫర్‌గడ్ : కనీస వేతన చట్టం అమలు కోసం కార్మికులు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి దారులకు ఊడిగం చేస్తూ కార్మికులను విస్మరించాయన్నారు. కనీస వేతన చట్ట ప్రకారం కార్మికులకు రూ. 18 వేల వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగలు సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 19వ తేదీన సమ్మె చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో కె.రమచంద్రు, శ్రీనివాస్, దుర్గయ్య, అనిల్, అలీమ్, మోహన్, అప్సర్, కిష్టయ్య, యాకయ్య, సారయ్య, మొగిళి, సమ్మయ్య, బలరాం, సాంబయ్య, లక్ష్మినర్సు, ఎల్లస్వామి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

'ధ్యాన్‌చంద్ సేవలు మరువలేనివి'

చిలుపూర్ : హాకీ క్రీడాకారుడు, భారత గోల్డ్‌మెడలిస్ట్ ధ్యాన్‌చంద్ సేవలు మరువలేనివని మండల విద్యాశాఖ అధికారి టీ.లక్ష్మయ్య అన్నారు. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవంతో పాటు ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు, క్రీడాకారులు ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హిమాద్రి, సతీష్‌కుమార్, శైలజ, పీఈటీలు శైలేందర్ సింగ్, దిలీప్, కొండ రవి పాల్గొన్నారు.

'షరతులు లేకుండా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి'

జనగామ టౌన్: గీత వృత్తిలో భాగంగా ప్రమాదవశాత్తు మృతిచెందిన, గాయపడిన కల్లుగీత కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా ఎక్స్‌గ్రేషియా వర్తింపజేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ముఖ్యకార్యకర్తల సమావేశానికి వెంకటమల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మృతి చెందిన, శాశ్వత వికలాంగులైన గీత కార్మికులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఆసరా ఫించన్ తీసుకునేవారికి రూ.5 లక్షల వర్తింపు ఉండదని చెప్పడం అన్యాయమన్నారు. జీఓ 53 ప్రకారం వృత్తిలో చనిపోయిన, వికలాంగులైన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బుర్రా ఆంజనేయులు, దూలం సత్తయ్య, పెద్ద యాదగిరి, మార్క ఉపేందర్, మైసగౌడ్, కుర్రెముల శ్రీనివాస్, అంబాల శ్రీనివాస్, పర్శరాములు, నామాల ఉప్పలయ్య పాల్గొన్నారు.

టీఆర్ఎస్ యువజన ప్రచార కార్యదర్శిగా వరప్రసాద్

చిలుపూర్ : టీఆర్ఎస్ చిలుపూర్ మండల యువజన విభాగం ప్రచార కార్యదర్శిగా మండలంలోని మల్కాపూర్‌కు చెందిన ద్రాక్షపల్లి వరప్రసాద్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన వరప్రసాద్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రాజయ్యతో పాటు రంజిత్‌రెడ్డి, వంశీ, నాగరాజులకు ధన్యవాదాలు తెలిపారు.

మిషన్ భగీరథ గుంతలో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు

తరిగొప్పుల: మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్ కోసం తీసినటువంటి గుంతలు అసంపూర్తిగా పూడ్చంతో అదుపు తప్పిన ఆర్టీసి బస్సు ఆ గుంతలో ఇరుక్కుపోయింది. ప్రయాణికులు డ్రైవర్ నానా అవస్థలు పడ్డారు. నిత్యం జనసంచారం ఉండేటువంటి బస్టాప్ సమీపంలో తీసిన భగీరథ గుంతలను సరిగ్గా పూడ్చాలనీ గ్రామస్థులు డిమాండ్ చేశారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

చిలుపూర్ : తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. మంగళవారం ప్రత్యేక అధికారి ప్రశాంతి అధ్యక్షతన జరిగిన వేడుకలలో బాలికలచే పద్య పోటీలతో పాటు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్టీలు సింధూజ, యాదలక్ష్మి, సోని, హేమలత పాల్గొన్నారు.

రాఘవాపురంలో వైద్య పరీక్షలు

పాలకుర్తి : మండలంలోని రాఘవాపురంలో బాలవికాస ఆధ్వర్యంలో మంగళవారం పాలకుర్తి ప్రాథమిక ఆస్పత్రి వైద్యులు గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థులు ఆరోగ్యంగా ఉండేందుకు వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శంషోద్దీన్ డాక్టర్ లింగమూర్తి, సత్యనారాయణ, సిబ్బంది తదితరులున్నారు.

'సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి'

పాలకుర్తి : జిల్లాలో పని చేస్తున్న సాక్షర భారత్ మండల, గ్రామ కోఆర్డినేటర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సలేంద్ర సోమన్న కోరారు. మంగళవారం మండల ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందంచారు. సోమన్న మాట్లాడుతూ ఏడు సంవత్సరాల నుంచి అరకొర వేతనాలతో పని చేస్తున్నా ప్రభుత్వం వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామకోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

'డీఎస్సీ జాప్యంతో నిరుద్యోగుల ఆత్మహత్యలు'

జఫర్‌గడ్ : డీఎస్సీ జాప్యంతోనే నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి కూరపాటి విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం వస్తుందని చెప్పిన కేసీఆర్ మాటలు నమ్మి రాష్ట్రం కోసం ఎందరో యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను పట్టించుకోవడం లేదన్నారు. ఇంత వరకు డీఎస్సీని విడుదల చేయలేదన్నారు. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేస్తామని తప్పుడు జీవోలను ఇవ్వడం, వాటిని కోర్టులు కొట్టి వేయడం, పరిపాటిగా సాగు తోందన్నారు. సమావేశంలో ఆర్.నరేష్, ఎండి.రియాజ్, కె.అనిల్, పి.భాస్కర్, రాజు పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా విద్యారాణి

పాలకుర్తి : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నూతన ప్రిన్సిపాల్‌గా విధ్యారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన రమాదేవి పదోన్నతిపై వరంగల్ ఆర్‌సీవోగా వెళ్లారు. ఆమె స్థానంలో మడికొండలో పని చేసిన విద్యారాణి బాధ్యతలు చేపట్టారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 5


మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది. వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి.


వృషభరాశి: (ఏప్రిల్21-మే20): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆంతరంగిక చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. పూజలు, వేడుకల్లో పాల్గొంటారు. విరాళాలు, దానధర్మాలకు ఖర్చు చేస్తారు.


మిథునరాశి: (మే21-జూన్21): ప్రియతముల కలయికతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. సమావేశాల్లో మార్పులకు ప్రయత్నిస్తారు. వేడుకలు, శుభకార్యాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి అనుకూలం.


కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వృత్తి, వ్యాపారాలకు అవసరమైన పత్రాలు, సరకుల రవాణాకు అనుకూలం. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి. రిజిస్ట్రేషన్లకు శుభతరుణం. సన్నిహితు ఆరోగ్య విషయాలపై దృష్టి సారిస్తారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. షాపింగ్, క్రయవిక్రయాలకు అనుకూలం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.


కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బదిలీలు, మార్పులకు అనుకూలం. దూరంలో ఉన్న బంధుమిత్రులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు.


తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.


వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి.


ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.


మకరరాశి(డిసెంబర్22-జనవరి21): దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్సవాలకు నిధులు సమకూరతాయి. ముఖ్య సమాచారం అందుకుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.


కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.


మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఉన్నత పదవులు అందుకుంటారు. భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జన సంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సిగ్నల్ లోపంతో నిలిచిన మణుగూరు

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా) : జిల్లాలోని కేసముద్రం-తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం కాజీపేట నుంచి మణుగూరుకు వెళ్లే మణుగూరు ప్యాసింజర్ సిగ్నల్‌లో సాంకేతిక లోపం ఏర్పడడంతో అర్థగంటకు పైగా నిలిచిపోయింది. సిబ్బంది సిగ్నలింగ్‌కు మరమ్మతులు నిర్వహించడంతో రైలు యథావిధిగా కదిలి వెళ్లినట్లు ప్రయాణికులు తెలిపారు.

వ్యాగన్ లింక్ తెగి నిలిచిన గూడ్స్ రైలు

గార్ల(మహబూబాబాద్ జిల్లా) : గూడ్స్ రైలు వ్యాగన్ లింక్(డబ్బాల నడుమ లింక్) తెగిపోవడంతో సుమారు అర్థగంట సేపు నిలిచిన సంఘటన మంగళవారం గార్ల రైల్వే బ్రిడ్జిపై జరిగింది. ఖాజీపేట నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న గూడ్స్ రైలు గార్ల సమీపంలో పాకాల బ్రిడ్జిపైకి రాగానే వ్యాగన్ మధ్య లింక్ తెగిపోయింది. దీంతో గూడ్స్ రైలు సగం వ్యాగన్లు బ్రిడ్జిపై నిలిచిపోయాయి. అప్రమత్తమైన గార్డు వెంటనే వాకీటాకీతో డ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే రైలును నిలిపివేశాడు. సిబ్బంది మరమ్మతు చేసిన అనంతరం రైలును పంపించారు. దీంతో పుష్‌పుల్ ప్యాసింజర్, కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైళ్లు అర్థగంటకు పైగా ఆలస్యంగా నడిచాయి.

మేడారంలో పర్యటించిన పోలీసులు



మేడారం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న పోలీసులు

మేడారం (జయశంకర్ జిల్లా) : తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో వచ్చే ఏడాది జరగబోయే సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఏర్పాట్లలో భాగంగా మంగళవారం జిల్లాలోని పోలీసుఅధికారులు మేడారం పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈసందర్భంగా వారు రోడ్డు మ్యాప్, వీఐపీల భద్రత, పోలీసు ఉన్నతాధికారుల వసతిపై సమీక్షించారు. అదేవిధంగా నార్లాపూర్, కొత్తూరు, కాల్వపల్లి, కన్నెపల్లి, రెడ్డిగూడెం, ఎల్బాకలలో రోడ్లు, వాహనాల పార్కింగ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు దక్షిణామూర్తి, కేఆర్కే.ప్రసాద్, సీఐలు బాలాజీ, రఘుచందర్, శంకర్‌రెడ్డి, వేణు, రమేష్, మోహన్, ఏఆర్ఐ సతీష్‌కుమార్, ఎస్‌బీ సీఐ సతీష్‌కుమార్, ఎంటీవో సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ములుగు నియోజకవర్గానికి గోదావరి జలాలు

● రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు ● త్వరలోనే నియోజకవర్గానికి వస్తానని స్పష్టీకరణ



మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం సమర్పించి పరిస్థితిని వివరిస్తున్న ప్రహ్లాద్

ములుగు(జయశంకర్ జిల్లా) : ములుగు నియోజకవర్గంలోని పొలాలనుగోదావరి జలాలతో తడిపి సస్యశ్యామలం చేస్తానని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావు హామీ ఇచ్చారు. మధ్య, చిన్నతరహా సాగునీటి వనరులను అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ఆయామండలాలకు చెందిన సుమారు 500మంది రైతులు మంగళవారం మహబూబాబాద్ ఎంపీ అజ్మీరాసీతారాం నాయక్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్, టీఆర్ఎస్ నియోజవర్గఇన్‌చార్జి అజ్మీరా ప్రహ్లాద్ నేతృత్వంలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీష్‌రావును కలిసి సాగునీటి కష్టాలను ఏకరువు పెట్టి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ తలాపున గోదావరి పారుతున్నా ములుగు నియోజకవర్గానికి నీరివ్వకపోవడం సరికాదన్నారు. ప్రతీ మండలానికి నీరు తరలించేలా అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ములుగు నియోజకవర్గంలో అవసరమైనన్ని ఎత్తిపోతల పథకాలు మంజూరు చేస్తానన్నారు. గౌరారం, కప్ప వాగుతో పాటు బూటారం, పాలవాగులపై చెక్‌డ్యాంలు నిర్మిస్తామని, లక్నవరం, మల్లూరు ప్రాజెక్టు, చక్రవర్తి మాటు, నల్లకుంట, లోకం చెరువులను ఆధునీకరిస్తామని చెప్పారు. పూర్తి స్థాయి నివేదికలను తెప్పించుకొని పరిశీలించి త్వరలోనే మంత్రి చందూలాల్‌తో నియోజకవర్గంలో పర్యటిస్తానని హరీష్‌రావు తెలిపారు.

మంత్రి హరీష్‌రావును కలిసిన తర్వాత ఆయన సూచన మేరకు రైతులు జలసౌధకు వెళ్లారు. అక్కడ మైనర్ ఇరిగేషన్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ శ్యాంసుందర్‌తో భేటీ అయ్యారు. మండలానికి పది మంది చొప్పున రైతులతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన అక్కడి సాగునీటి వనరుల పరిస్థితి, రైతులు చెప్పిన సమస్యలను రికార్డు చేసుకున్నారు.

ములుగుకు మంచి రోజులు : ఎంపీ

ములుగు నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి కష్టాలు తీరి మంచి రోజులు రానున్నాయని ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. మంత్రి హరీష్‌రావును కలిసిన తర్వాత ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. దేవాదుల పైప్‌లైన్ ద్వారా ఇప్పటికే వెంకటాపురం మండలంలోని 30 చెరువులను నింపేందుకు ప్రణాళిక సిద్ధమైందని చెప్పారు.





క్యాంపస్‌లో మహిళా హాస్టల్‌ను పరిశీలిస్తున్న న్యాక్ బృందం కన్వీనర్ గౌతం, కంప్యూటర్ సైన్స్ విభాగం వద్ద న్యాక్ బృందం, అధ్యాపకులు

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

● తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై ఆరా ● కేయూలో రెండో రోజు న్యాక్ ప్రతినిధుల పర్యటన ● నేటితో ముగియనున్న పరిశీలన

కేయూ క్యాంపస్ (కాళోజీ జంక్షన్) : నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం కాకతీయ యూనివర్సిటీలో రెండో రోజైన మంగళవారం తమ పర్యటనను కొనసాగించింది. న్యాక్ బృందానికి నేతృత్వం వహిస్తున్న ప్రొఫెసర్ ఎన్‌సీ గౌతం వర్సిటీలోని అన్ని విభాగాలను సందర్శించారు. న్యాక్ ప్రతినిధులు గౌతం సన్యాల్, కన్హయ్య అహుజ, ఏవీ సింగ్ మద్నావత్, సీహెచ్‌పీ పాండే, సంజీవ్‌పురి, వైకే గుప్తా రెండు బృందాలుగా విడిపోయి క్షేత్ర స్థాయిలో పర్యటన సాగించారు. రసాయన శాస్త్ర విభాగం, ఇంజనీరింగ్ కళాశాల, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లీష్ విభాగాలతో పాటు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, స్పోర్ట్స్ విభాగం, హాస్టల్స్, ఎస్సీ, ఎస్టీ సెల్, బీసీ విభాగాలను పరిశీలించారు. ప్రతీ విభాగంలో బోధన విధానాలు, మౌళిక వసతులపై పరిశీలన చేశారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల కిషన్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అభివృద్ధిని వివరించారు.ఫ్యాకల్టీ, ల్యాబ్స్, సౌకర్యాలు, ప్లేస్‌మెంట్ వివరాలను నివేదించారు. అలాగే కంప్యూటర్ సైన్స్ విభాగంలో డాక్టర్ రమాదేవి కంప్యూటర్ సైన్స్ విభాగం అభివృద్ధిని నివేదించారు.ఇంగ్లీష్ విభాగంలోనూ వివరాలను సేకరించారు. వీటితో పాటు పరిపాలన, అకడమిక్, అకౌంట్స్, యూజీసీ, సీడీసీ, అకడమిక్ అఫైర్స్, పరీక్షల నియంత్రణాధికారుల కార్యాలయాలను పరిశీలించి పనితీరును తెలుసుకున్నారు.

న్యాక్ కమిటీకి నేతృత్వం వహిస్తున్న ఎన్‌సీ గౌతం అంబేద్కర్ హాస్టల్‌ను స్వయంగా పరిశీలించారు. మొదటి గేటు వద్ద ఉండే మహిళా హాస్టల్స్‌ను కలియ తిరిగారు. విద్యార్థినులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను నోట్ చేసుకుని సమస్యలను తెలుసుకున్నారు. భోజనం నాణ్యత మొదలుకుని పనితీరు, మాట తీరు వరకు అన్ని అంశాలను సేకరించారు.

టాయిలెట్స్‌పై ప్రత్యేక దృష్టి..

న్యాక్ బృందం సభ్యులు తమ పర్యటనలో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయా డిపార్ట్‌మెంట్లకు వెళ్లినప్పుడు అధ్యాపకులు, విద్యార్థులు ఉపయోగించే టాయిలెట్స్ ఎక్కడ ఉన్నాయని అడిగి మరీ పరిశీలించారు. బృందంలోని ఓ అధికారి మొత్తం ఇదే పనిమీద ఉన్నట్టుగా కనిపించింది. వివరాలు సేకరించి బయటకు వెళ్లే సమయంలో తనకు టాయిలెట్‌కు వెళ్లే అవసరం ఉన్నట్టుగా భ్రమింపచేస్తూ... 'టాయిలెట్స్ ఎక్కడ..?' అని అడిగి లోపలికి వెళ్లి వాటిని పరిశీలించారు. విద్యార్థులు ఉండే గదులు, పరిసరాలను పరిశీలించి నోట్ చేసుకున్నారు.

సోమ, మంగళవారాల్లో న్యాక్ ప్రతినిధులు క్యాంపస్‌లో పర్యటించడం ద్వారా అన్ని డిపార్టుమెంట్‌లు, హాస్టల్స్, కార్యాలయాల పరిశీలనను పూర్తిచేశారు. తాము సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం రిపోర్టు తయారు చేస్తారు. మధ్యాహ్నం తర్వాత సెనెట్ హాల్‌లో వైస్ చాన్స్‌లర్ ఆర్.సాయన్న, రిజిస్ట్రార్ కె.పురుషోత్తం, ఇతర అధికారులతో సమాలోచనలు చేస్తారు. తమ దృష్టికి వచ్చిన అంశాలపై చర్చిస్తారు. అనంతరం కేయూ అధికారులు కమిటీకి ఎగ్జిట్ సమావేశం ఏర్పాటు చేస్తారు. దీంతో న్యాక్ పర్యటన పూర్తవుతుంది. కాగా, న్యాక్ ప్రతినిధులు తమ రిపోర్టును కేంద్ర డైరెక్టర్ కార్యాలయానికి సమర్పించిన తర్వాత నెల, రెండు నెలల్లో కేయూకు గ్రేడ్ ప్రకటించే అవకాశం ఉంది.

పది రోజుల్లో కాళేశ్వరాలయ అభివృద్ధి పనులకు టెండర్లు : సీఎం

కాళేశ్వరం(జయశంకర్ జిల్లా) : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ఆలయ అభివృద్ధి పనులకు పది రోజుల్లో టెండర్లు పిలవనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం అధికారులతో కాళేశ్వరం ఆలయం అభివృద్ధిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. గతేడాది రూ.25కోట్ల నిధులు మంజూరు చేయడంతో వాటికి సంబంధించిన పనులపై సమావేశం నిర్వహించారు. 14 పనులకు ఎస్టిమేట్లు పూర్తయినట్లు అధికారులు వెల్లడించగా పది రోజుల్లో టెండర్లు పిలిచి సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఐకే రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, కాళేశ్వరం దేవస్థానం ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఎస్పీ ఎదుట ఇద్దరు మావోల లొంగుబాటు

ఏటూరునాగారం రూరల్ (జయశంకర్ జిల్లా) : ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు మావోయిస్టులు ఏటూరునాగారం ఏఎస్పీ రాహుల్‌హెగ్డే ఎదుట మంగళవారం లొంగిపోయారు. ఏటూరునాగారంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ వెల్లడించారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా సింగంపల్లి గ్రామానికి చెందిన పోడియం లక్కు 2011 సంవత్సరంలో ఊసూర్ కమాండర్ సోముడు ఆధ్వర్యంలో సీపీఐ (మావోయిస్టు పార్టీ)లో మిలీషియా సభ్యుడిగా చేరాడన్నారు. ఆ తర్వాత లక్కు 2014లో మిలీషియా ప్లటూన్‌సెక్షన్ కమాండర్‌గా ఎదిగి 2016 నుంచి ఊసూర్ కమాండర్ రమేష్ ఆధ్వర్యంలో పనిచేశారని అన్నారు. 2013లో సింగం వద్ద అంబుష్, 2016లో తావూర్‌గూడెం దగ్గర పోలీసులపై ఎదురుకాల్పులు, 2016 సెప్టెంబర్‌లో తుమ్మిరేని వద్ద ఎదురుకాల్పులు, 2017 జూన్‌లో పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో సోడి భీమను హత్య చేసిన సంఘటనలో లక్కు ప్రధాన నిందితుడని ఏఎస్పీ తెలిపారు. అలాగే బీజాపూర్ జిల్లా సింగంపల్లి గ్రామానికి చెందిన సోడి లక్ష్మి ఆరవ తరగతి చదువుకునే రోజుల్లో విప్లవ పాటలు, సాహిత్యానికి ఆకర్షితురాలై 2016లో ఊసూర్ దళ కమాండర్ రమేష్ ఆధ్వర్యంలో మావోయిస్టు మిలీషియా సభ్యురాలిగా చేరిందని తెలిపారు. 2016సెప్టెంబర్‌లో తుమ్మిరేని వద్ద పోలీసులపై ఎదురుకాల్పులు, 2017 జూన్‌లో సోడి భీమ హత్య సంఘటనలో నిందితురాలని చెప్పారు. ఇరువురు మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలపై నమ్మకం లేక జనజీవన స్రవంతిలోకి వచ్చేందుకు ఏటూరునాగారంలో మంగళవారం లొంగిపోయారని ఏఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. మావోయిస్టు పార్టీలో పనిచేసే వారెవరైనా భయం లేకుండా పోలీసుల ఎదుట లొంగిపోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో వెంకటాపురం(నూగూరు) సీఐ రవీందర్, ఎస్సై బండారికుమార్ పాల్గొన్నారు.



మావోయిస్టుల లొంగుబాటు వివరాలను తెలుపుతున్న ఏఎస్పీ



చెల్పూర్‌లో కేటీపీపీ ఎదుట రిలే దీక్షల్లో పాల్గొన్న ఇంజనీర్లు

కేటీపీపీలో ఇంజనీర్ల రిలే దీక్షలు ప్రారంభం

గణపురం (జయశంకర్ జిల్లా) : ఆంధ్రా ఇంజనీర్లను వెంటనే వారి స్వస్థలాలకు పంపించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఇంజనీర్స్ అసోసియేషన్ టీఎస్‌పీఈఏ, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటి అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపురం మండలం చెల్పూర్‌లోని కేటీపీపీ ముందు మంగళవారం ఇంజనీర్లు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ ఉద్యోగులవిభజన స్థానికత ఆధారంగా పూర్తి చేయాలన్నారు. ఆంధ్రా ఉద్యోగులను వెంటనే స్వస్థలాలకుపంపి తెలంగాణ ఉద్యోగుల పదోన్నతులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఇంజనీర్లకు ఇచ్చిన ప్రమోషన్ల మీద రిలీవ్ అయిన ఆంధ్రా ఇంజనీర్లు కోర్టుకు వెళ్లారన్నారు. కోర్టు ఆదేశాలతో యాజమాన్యం ప్రమోషన్లను వెనక్కి తీసుకోడానికి సిద్ధమవుతుందని వారు తెలిపారు. నాయకులు మల్లయ్య, సంతోష్, నరేష్, రామకృష్ణ, చంద్రశేఖర్, సుజిత్, తిరుపతి తదితరులు దీక్షలో కూర్చోగా వారికి కేటీపీపీలోని ఇంజనీర్లు సంఘీభావం తెలిపారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి : టీపీటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి

ములుగు (జయశంకర్ జిల్లా) : కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్‌ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు బి.కొండల్‌రెడ్డిప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు హట్కర్ సమ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి కొండల్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకుడు కె. వేణుగోపాల్, రాష్ట్ర కార్యదర్శి బి.రమేష్, జి.నటరాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. ఉద్యోగుల సొమ్మును షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టడంతో పదవీ విరమణ అనంతరంపొందే ప్రయోజనం ఎంత వస్తుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. ఈ విధానం అమలైతే ఉద్యోగుల వృద్ధాప్య జీవితం అంధకారంగా మారుతుందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీన సీపీఎస్ రద్దు కోసం జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొనాలనిపిలుపునిచ్చారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో టీచర్స్ ఫెడరేషన్ నాయకులు సోమేశ్వర్, సారయ్య,సేవానాయక్, మోహన్‌బాబు, ముకుందరెడ్డి,సత్యనారాయణ, కర్నాకర్, సంపత్, మల్లయ్య పాల్గొన్నారు.

జానపద కళలకు పూర్వవైభవం తేవాలి

జిల్లా కలెక్టర్ ప్రీతిమీనా



మహబూబాబాద్ పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

మహబూబాబాద్ అగ్రికల్చర్ : జానపద కళలను అందరూ బతికించుకుని పూర్వ వైభవం తేవాలని జిల్లా కలెక్టర్ ప్రీతిమీనా కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ సాంస్కృతిక సారథి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జానపద కళా దినోత్సవం సందర్భంగా మంగళవారం జానపద కళాజాతర కార్యక్రమం జరిగింది. ఈ కళాజాతరను రాష్ట్ర జానపద కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జేసీ కె.దామోదర్ రెడ్డి, జిల్లా పౌరసంబంధాల అధికారి అయూబ్‌అలీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఎన్ గార్డెన్‌లో రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రీతిమీనా జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. గ్రామీణ కళలు, జానపద కళలను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర జానపద కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు ఊపిరి పోసిన జానపద కళలకు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. జేసీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ జనం నోళ్లలో నిత్యంనానే జానపదాలే నిజమైన కళారూపాలన్నారు. ఈ కార్యక్రమంలో చిందుయాక్షగానం, చిరుతల భజ నం, బేతాళుడి కథ, తదితర 50 బృందాలు తమ కళారూపాలు ప్రదర్శించాయి. ఈకార్యక్రమానికి ముందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి బస్టాండ్ మీదుగా మథర్‌థెరిస్సా సెంటర్ వరకు విన్యాసాలతో కళాప్రదర్శన భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జోనల్ అధ్యక్షుడు గడ్డం సుధాకర్, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రచారి, కార్యదర్శి గంగుల శ్రీనివాస్, తెలంగాణ సాంస్కృతిక సారథి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కొమరి వెంకన్న, వెంకన్న పాల్గొన్నారు.

నిలకడగా ప్రణిత్‌తేజ్ ఆరోగ్యం

తల్లిదండ్రులను పరామర్శించిన ఉన్నతాధికారులు

నేడు బ్లూలైన్ ప్రైవేట్ ఆస్పత్రిలో బాలుడికి శస్త్ర చికిత్స



ఆస్పత్రిలో బాలుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న అధికారులు

దంతాలపల్లి(మహబూబాబాద్ జిల్లా): అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వేడి పాలలో పడి తీవ్రంగా గాయపడి హన్మకొండలోని బ్లూలైన్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సోమారపు ప్రణిత్‌తేజ్‌ను మంగళవారం ఉమ్మడి జిల్లా ఆర్జేడీ రాములు, జిల్లా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినా, మహిళా శిశుసంక్షేమ శాఖ ఆర్గనైజర్ చింతల భారతి రెడ్డి, వరంగల్ జిల్లా ఆర్గనైజర్ కమరున్నీసాబేగంలు పరామర్శించారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ 2వ అంగన్‌వాడీ సెంటర్ బాలుడు ప్రణిత్‌తేజ్ సోమవారం ఆడుకుంటూ వేడి పాలగిన్నెలో పడిపోవడంతో 45శాతం కాలిపోయినట్టు పీహెచ్‌సీ వైద్యులు ఇచ్చిన నివేదిక ఆధారంగా బాలుడికి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో వైద్యం అందించారు. శిశు సంక్షేమ శాఖ ఎంత ఖర్చయినా భరిస్తామనడంతో మంగళవారం హన్మకొండలోని బ్లూలైన్ ప్రైవేటు ఆస్పత్రికి బాలుడిని తరలించగా మెరుగైన వైద్యం అందిస్తున్నారు. విధి నిర్వహణలో టీచర్ నిర్లక్ష్యం కారణంగానే సంఘటన జరగడంతో టీచర్, ఆయాను తొలగించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కలెక్టర్ ప్రీతిమీనా, రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయేంద్రబోయి ఎప్పటికప్పుడు ప్రణిత్‌తేజ్ ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారన్నారు. ప్రణిత్‌తేజ్‌కు బుధవారం శస్త్ర చికిత్స(కొలాజీన్ చికిత్స) చేయనున్నట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు రూ.80 వేల చెక్కును ఆస్పత్రి పేరిట అందించనున్నామని లేనినా తెలిపారు. బాలుడికి వైద్య ఖర్చులు ఎంతైనా భరించేందుకు సిద్ధంగా ఉన్నామని తల్లిదండ్రులకు రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయేంద్రబోయి ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

ప్రణిత్‌తేజ్ ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు నివేదికలు..

ఈ నెల 28న వేడి పాల గిన్నెలో పడి తీవ్ర గాయలపాలైన ప్రణిత్ తేజ్ ఆరోగ్య పరిస్థితిని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయేంద్రబోయి రోజు వారీగా నివేదికను కోరడంతో ఐసీడీఎస్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలిస్తున్నారు. బాలుడికి నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు రోజు శిశు సంక్షేమాధికారులు సమీక్షించాలని విజయేంద్రబోయి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నిర్వహించనున్న శస్త్ర చికిత్సపై మంగళవారం నివేదికను పంపామని లేనినా తెలిపారు.



వరంగల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం అమిత్‌వర్ధన్

ప్రయాణికులకు వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి

వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లలో డీఆర్‌ఎం అమిత్‌వర్ధన్ తనిఖీలు

గిర్మాజిపేట(వరంగల్) : వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యతతో చర్యలు తీసుకోవాలని దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ అమిత్‌వర్ధన్ ఆదేశించారు. సాధారణ ప్రయాణికుల విశ్రాంతి గది, ఆర్‌పీఎఫ్, ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ల మరమ్మతు చేయాలనిఅన్నారు. అదనపు సీసీ కెమెరాలను మంజూరుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. స్వచ్ఛ్ రైలు పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వచ్ఛ్‌మరుగుదొడ్ల కార్యక్రమం చేపట్టడంతో డీఆర్‌ఎం అమిత్‌వర్ధన్ సాయంత్రం 4నుంచి 5.30 గంటల వరకు వరంగల్ రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేసిన అనంతరం రోడ్డు మార్గంలో వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ముందుగా ఆయన సాధారణ ప్రయాణికుల విశ్రాంతి గదిని తనిఖీ చేసి మరుగుదొడ్లను పరిశీలించారు.జనరల్ వెయిటింగ్ హాల్‌ను మరింతగా మెరుగుపరచాలని చెప్పారు. అక్కడి నుంచి ఆర్‌పీఎఫ్ ఠాణాకు వెళ్లి పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును సీఐ నర్సింహ వివరించారు. అలాగే రేకుల షెడ్‌లో ఉన్న ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ వర్షం పడితే పైకప్పు కురుస్తుండడంతో ఫైళ్లు తడుస్తున్నాయని ఎస్సై ఎస్.శ్రీనివాస్ చెప్పగా డీఆర్‌ఎం మరమ్మతు చేయించాలని అక్కడే ఉన్న ఐఓడబ్ల్యూ అధికారులను ఆదేశించారు. రైల్వే స్టేషన్ ప్రయాణికుల వసతులు తదితర విషయాలను స్టేషన్ మేనేజర్ జి.వెంకటేశ్వర్లు డీఆర్‌ఎంకు వివరించారు. ఈ తనిఖీల్లో రైల్వే డివిజనల్ వివిధ విభాగాల అధికారులు డాక్టర్ సుమిత్‌వర్మ, మనోహర్ రెడ్డి,అనిల్‌కుమార్, పూర్ణచందర్, శ్రీనునాయక్, స్థానిక సిసిఐ రాజ్‌గోపాల్, సిటిఐ బి.శ్రీనివాసరావు, సిబిఎస్‌ఆర్ రాంనాయక్, ఐఓడబ్లు అధికారి సత్యనారాయణ, టెలి ఇంజనీయర్ వెంకటేశ్వర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌ద్వివేది, ఆర్‌పీఎఫ్ ఎస్సై క్రాంతి కుమార్, జీఆర్‌పీ ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాజీపేటలో రైల్వే డీఆర్‌ఎం..

కాజీపేట : కాజీపేటలో మంగళవారం దక్షిణమధ్య రైల్వే డీఆర్‌ఎం అమిత్‌వర్ధన్ ప్రత్యేక తనిఖీలు చేశారు. దానాపూర్‌ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన డీఆర్‌ఎం కాజీపేటలో దిగి ముందుగా రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్లాట్‌ఫారాలు, క్యాంటిన్, స్టాల్స్, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులను తనిఖీ చేశారు. స్టేషన్‌లో వెయిటింగ్ హాల్‌లో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా చూసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్లాట్‌ఫారాలు, మరుగుదొడ్లు అనుకున్న స్థాయిలో పరిశుభ్రంగా లేవని అందుకు అధికారులు నిత్యం పర్యవేక్షించాలని మందలించారు. అనంతరం రైల్వే కమ్యూనిటీ హాల్‌లో సేఫ్టీ విభాగం ఉద్యోగులు, అధికారులతో డీఆర్‌ఎం అమిత్‌వర్ధన్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. రైల్వే శాఖ పూర్తిగా సేఫ్టీ విభాగంపైనే ఆధారపడి నడుస్తుందన్నారు.

రెండు పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

సీపీ సుధీర్‌బాబు, కలెక్టర్ శ్రీదేవసేన





శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు, రిజర్వాయర్ కట్టపై నిమజ్జనానికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ శ్రీదేవసేన

స్టేషన్‌ఘన్‌పూర్: బక్రీద్, గణేష్ నిమజ్జనం వరుసగా వస్తున్న రెండు పండుగలను శాంతియుత వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు పిలుపునిచ్చారు. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ వద్ద వినాయక నిమజ్జనం కోసం చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం కలెకర్ శ్రీ దేవసేనతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతి సంఘాలు, నవరాత్రి ఉత్సవ కమిటీలు, ముస్లింలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ దేశంలో భిన్నత్వంలో ఏకత్వంగా కలిసి జీవిస్తున్న మనం పండుగలను కూడా విబేధాలు లేకుండా జరుపుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు కలుగకుండా పోలీసులు ఇచ్చే సలహాలు పాటించి నిమజ్జనం నిర్విఘ్నంగా పూర్తి చేసుకోవాలన్నారు. నిమజ్జన ప్రదేశంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం భారీకేడ్లు, అత్యవసర పరిస్థితుల కోసం 108 అంబులెన్సు, వైద్య సేవలు, విద్యుత్ సౌకర్యం, గజ ఈతగాళ్లు, క్రేను, జేసీబీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ శ్రీదేవసేన మాట్లాడుతూ విత్తన బంతులు, హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసి జిల్లాకు గుర్తింపు తెచ్చిన ప్రజలు రెండు పండుగలను శాంతియుత వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీ వెంకన్న, డీపీవో రవికుమార్, ఆర్‌డీవో మాలతి, ఏసీపీ సంజీవరావు, జడ్పీటీసీ భూక్య స్వామినాయక్, సొసైటీ చైర్మన్ గట్టు రమేష్, సీఐ ఆర్.నరేందర్, సర్పంచ్ ఇల్లందుల ప్రతాప్, ఎంపీటీసీలు సత్యనారాయణరాజు, ఉపేందర్, తహసీల్దార్లు సదానందం, గంగాభవాణి, ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలను నిమజ్జనానికి తీసుకెళ్లవద్దు : కలెక్టర్

జనగామ, ఆంధ్రజ్యోతి : గణేష్ నిమజ్జనాన్ని ప్రజలు శాంతియుతంగా, ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీదేవసేన కోరారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వచ్చే నెల 3న జరిగే గణేష్ నిమజ్జనంపై డీసీపీ వెంకన్న, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే వినాయకచవితి వరకు జిల్లా వ్యాప్తంగా మట్టి గణపతులనే పూజించేలా గణేష్ ఉత్సవ కమిటీలకు అవగాహన కల్పించాలన్నారు. చెట్లను పూజించే సంస్కృతిని కాపాడి ప్రతీ ఒక్కరు సాధ్యమైనన్నీ మొక్కలు నాటాలన్నారు. నిమజ్జనానికి పది సంవత్సరాలలోపు పిల్లలను తీసుకువెళ్లవద్దని సూచించారు. డీసీపీ తేజావత్ వెంకన్న మాట్లాడుతూ నిమజ్జనం కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించాలని, ఆలస్యం కాకుండా త్వరత్వరగా నిమజ్జన కార్యక్రమాన్ని ముగించేలా చూడాలని ఉత్సవ కమిటీలను కోరారు. సమావేశంలో ఆర్డీవో వెంకట్‌రెడ్డి, పోలీసు అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొత్తూరి వాసు, మంచాల రవీందర్, కేవీఎల్ఎన్‌రెడ్డి, శివరాజ్, ప్రవీణ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు అవసరమే'

బచ్చన్నపేట: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమేనని ఎంఈవో జనార్దన్ అన్నారు. మంగళవారం మండలంలోని కట్కూరు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించి జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లోనూ రాణించేందుకు విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల నుంచి అనేక మంది విద్యార్థులు అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం అండర్-12, అండర్ -16కు ఎంపిక చేయబడిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో రాణించాలన్నారు. కాగా, మండల పరిధిలోని 30 పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ టేకులపల్లి సుగుణప్రభాకర్, పాఠశాల చైర్మన్ పుట్ట నర్సింహులు, హెచ్‌ఎం శ్రవణ్‌కుమార్, పీఈటీల సంఘం జిల్లా కార్యదర్శి బెల్లంకొండ రమేశ్, సహాయ కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, కృష్ణారావు, పీఈటీలు ఎం.కవిత, కిరణ్, రమాదేవి, యాదయ్య, కిష్టయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయంత్రం సమయాల్లోనే మందులను పిచికారి చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి వీరునాయక్



పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు

నర్మెట: రైతులు సాగు చేసిన పంటలపై ఇష్టం ఉన్న మందులను పిచికారి చేయవద్దని, వ్యవసాయ అధికారులు సూచించిన ఫెస్టిసైడ్స్‌ను వాడాలని అవి కూడా సాయంత్ర సమయాల్లో పంటలపై పిచికారి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వీరునాయక్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో తీగుళ్ల భూపతిరెడ్డి పత్తిపంట క్షేత్రం, దామెర జనార్దన్‌రెడ్డి వరిపంట క్షేత్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాభావంతో పత్తిలో పెరుగుల ఆగిపోయి అక్కడక్కడ గూడ రాలుతుందన్నారు. రైతులు దీంతో భయపడాల్సిన అవసరం లేదన్నారు. రైతులు పూత దశలో మైక్రోన్యూట్రిన్స్(19-19-19), మెగ్నిషియం సల్ఫేట్, ప్లానోఫిక్స్ మందులలో వేపనూనె(నీమ్ ఆయిల్) లేదా నువ్వుల నూనె కలిపి పిచికారి చేయాలన్నారు. పత్తికి గులాబీరంగు పురుగు వచ్చే అవకాశం ఉందన్నారు. ముందస్తుగానే ఫోర్‌మెన్‌ట్రిబ్స్ పెట్టాలన్నారు. వరిలో కాండం తొలుచు పరుగును అరికట్టాలంటే నారు దశలోనే కార్బోఫ్యూరన్ గుళికలు చల్లాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. 31 వరకు వరిపంటకు ఫసల్ బీమా చేసే అవకాశం ఉందని, వరి పంట సాగు చేసిన ప్రతీ రైతు ఫసల్ బీమాను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ లాల్‌చంద్, ఏఈవోలు వసంత, కమలాహసన్, వరణ్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎమ్డీ గౌస్, భూక్య జయరాం, ఇట్టబోయిన రమేష్, ఆమెడపు కమలాకర్‌రెడ్డి, గుగ్రాల దయాకర్‌రెడ్డి, కాశిరాంనాయక్, బాలయ్య, కర్ణాకర్, రాంరెడ్డి, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య : డీఈవో యాదయ్య

జనగామ ఎడ్యుకేషన్: జిల్లాలో పనిచేస్తూ అక్రిడిటేషన్ కలిగిఉన్న జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో చదివేందుకు ఉచితవిద్య అవకాశం కలిపిస్తున్నట్లు డీఈవో యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన జర్నలిస్టు పిలల్లకు ఉచిత విద్యనందించేందుకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. కలెక్టర్ శ్రీదేవసేన సూచనల మేరకు జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టు పిల్లల వివరాలు డీఈవో కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఏఏ పాఠశాలలో చదువుతున్నది, చదువుతున్న తరగతుల వివరాలు, ఆధార్ కార్డ్, జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ ఆయాస్కూళ్లలో అందించాలని ఆయన సూచించారు.

సెప్టెంబర్ 3న వివాహ పరిచయ వేదిక

జనగామ కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన విశ్వకర్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న వరంగల్ నగరంలోని కొత్తవాడ రైజింగ్ సన్ ఉన్నత పాఠశాల ఆవరణలో వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ చైర్మన్ అడ్లూరి రవీంద్రచారీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ నెల మొదటి ఆదివారం రోజున వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఉచితంగా రెండేళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. విశ్వబ్రహ్మణ వివాహం కావాల్సిన యువతీ, యువకులు హాజరుకావాలని కోరారు.

గుడుంబా తయారీ మానేసిన కుటుంబాలకు రుణాలు

గుండాల: గ్రామాల్లో గతంలో గుడంబా అమ్మి మాని వేసిన కుటుంబాలకు ప్రభుత్వం పునరావాస పథకం ద్వారా రుణాలు మంజూరు చేస్తోందని ఎక్సైజ్ ఎస్సై సుధీర్ కుమార్ తెలిపారు. కాగా, గుడంబా అమ్మిన మండలంలోని పెద్దపడిశాల గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మి, నత్తి సోమక్కలను మంగళవారం తహసీల్దార్ స్వప్న ఎదుట బైండోవర్ చేశారు. వారిరువురికి 2 లక్షల చొప్పున కిరాణ షాపు, డైరీ నిర్వహణకు రుణాలు మంజూరయ్యాయని ఎస్సై తెలిపారు.

'ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ప్రతిభావంతులు'



విద్యార్థులకు బహుమతులందజేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

పాలకుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ ప్రతిభావంతులుగా ఎదుగుతున్నారని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎవరెస్టు శిఖరాలు అధిరోహించారన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అటు చదువులోను ఇటు క్రీడల్లోను తర్ఫీదునిస్తోందని స్పష్టం చేశారు. ముఖ్యంగా డాక్టర్ ప్రవీన్‌కుమార్‌ను ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు సెక్రటరీ నియమించిన తర్వాతనే అనేక మార్పులు వచ్చాయని అన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 20 మంది విద్యార్థులు మెడిసిన్‌లో సీట్లు సాధించడానికి ఆయన పాత్ర ఘనీయమైందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన క్రీడా విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యారాణి, శీలా, డీఎస్ లత, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గూడెం'లను సందర్శించిన డీఆర్‌డీవో



లింగాల ఘణపురంలోని పిట్టలోనిగూడెం వాసులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో జయచంద్రారెడ్డి

లింగాలఘణపురం: చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని ప్రతీ ఒక్కరూ కుటుంబ నియంత్రణపై అవగాహన కలిగి ఉండటంతో పాటు కు.ని ఆపరేషన్లు చేయించుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం లింగాలఘణపురం మండలం మాణిక్యాపురం శివారు పిట్టలోనిగూడెంను సందర్శించిన డీఆర్‌డీవో జయచంద్రారెడ్డి అక్కడ జీవిస్తున్న సంచారకుటుంబాల జీవన స్థితిగతులను పరిశీలించారు. గూడేనికి రోడ్డు సౌకర్యంతో పాటుగా ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు హద్దులను ఏర్పరచి మామిడి తోటల పెంపకానికి కృషి చేస్తానని సూచించారు. పిట్టలోనిగూడెంవాసులకు ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారించేం దుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ డాక్టర్ నారాయణ, ఈజీఎస్ ఏపీవో రమాదేవి, ఐకేపీ ఏపీఎం శంకరయ్య, సీసీ శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక హెచ్‌ఎం సత్యనారాయణ, వార్డుసభ్యులు సిద్దులు తదితరులు ఉన్నారు.

రఘునాథపల్లిలో...

రఘునాథపల్లి: మండలంలోని రఘునాథపల్లి-కంచనపల్లి రోడ్డు సమీపంలోని పిట్టలగూడేన్ని టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారపు ప్రతాప్, డీఆర్‌డీవో జయచంద్రారెడ్డి మంగళవారం సందర్శించారు. ఇన్ని రోజులుగా పిట్టలగూడెంగా పిలవబడుతున్న కాలనీకి సీఎం కేసీఆర్ పేరు మీద కేసీఆర్ నగర్‌గా నామకరణం చేసి ఆ స్థాయికి తగ్గట్టు అభివృద్ధి చేయడానికి శ్రీకారం చుట్టిన ప్రతాప్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం, పింఛన్లు, రుణాలు మంజూరు చేయాలని డీఆర్‌డీవోకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఐకేపీ, ఏపీఎం భవాని, ఈజీఎస్ ఏపీవో ప్రేమయ్య, వీఆర్‌వో రాములు, ఉపసర్పంచ్ గైని రాంచందర్, కన్న కనకయ్య పాల్గొన్నారు.

సర్కారీ దవాఖానాల్లో రోగులకు మందుల పంపిణీలో పారదర్శకతను పెంపొందించే దిశగా ప్రవేశపెట్టిన 'ఈ-ఔషధి' సాఫ్ట్‌వేర్ వినియోగంలో అవాంతరాలు ఎదురవుతున్నాయి.. గత మార్చి నుంచే ఈవిధానం అమల్లోకి వచ్చినప్పటికీ ఇప్పటిదాకా నిర్వహణ గాడిన పడలేదు. వైద్యులు, ఫార్మసిస్టుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఓపీకి వచ్చే రోగుల వివరాలు, వారికి రాసిన మందుల చిట్టాను ఎప్పటికప్పుడు ఈ-ఔషధి సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయడం లేదు. ఇందులో తమ తమ దవాఖానాలకు అవసరమైన మందుల వివరాలతో సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు ఇండెంట్ పెట్టడానికి వాడి వదిలేస్తున్నారు. ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో బృహత్తర లక్ష్యం నీరుగారుతోంది.



హతవిధీ 'ఈ-ఔషధి'

- 'ఈ-ఔషధి' సాఫ్ట్‌వేర్ వినియోగంలో సర్కారీ దవాఖానాల వెనుకంజ
- వైద్యులు, ఫార్మసిస్టులు చొరవ చూపకపోవడంతో కానరాని సత్ఫలితాలు
- ఆన్‌లైన్‌లో రోగులు, ఔషధాల వివరాల నమోదులో నిర్లక్ష్యం

❑ జనగామ, ఆంధ్రజ్యోతి

ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రవేశపెట్టిన సరికొత్త యత్నం 'ఈ-ఔషధి' సాఫ్ట్‌వేర్. దీని వినియోగం జనగామ జిల్లాలోని దవాఖానల్లో ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. గత మార్చి నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చినప్పటికీ ఇంకా గాడిలో పడలేదు.

నమోదుచేయాల్సిన వివరాలివీ..

- ఓపీ విభాగానికి వచ్చే రోగుల ఆధార్ కార్డు నంబర్‌ను ఈ-ఔషధిలో నమోదు చేయాలి.
- వైద్య పరీక్షల సమాచారం పేర్కొనాలి.
- డాక్టర్ రాసిన మందుల లిస్ట్‌ను అప్‌లోడ్ చేయాలి.
- ఏయే రకాల మందులు అందించారనే దానిపై విభజనాత్మక సమాచారం పొందుపర్చాలి.

ప్రయోజనాలివీ..

- సాఫ్ట్‌వేర్‌లో వివరాలు నమోదుచేస్తే అటు రోగులకు, ఇటు వైద్యులకు ఎంతో సౌకర్యం ఉంటుంది.
- రోగి ఇప్పటివరకు తీసుకున్న మందుల చిట్టాను ఎల్లవేళలా ఆన్‌లైన్‌లో సాఫ్ట్‌వేర్‌లో చూడొచ్చు.
- రోగి పేరు, అతడికి చికిత్స అందించిన డాక్టర్ పేరు ఉంటాయి. భవిష్యత్తులో అతడు వేరే ప్రాంతంలోని సర్కారు దవాఖానలో చికిత్సపొందాల్సి వస్తే అక్కడ ఆన్‌లైన్‌లో వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. రోగి ఆధార్‌కార్డు నంబర్‌తో గతంలో అతడు పొందిన వైద్యసేవల వివరాలు వస్తాయి.
- ఇక మెడికల్ రిపోర్ట్‌ల అవసరం లేదు. ఆధార్ కార్డు నంబర్ ఉంటే చాలు.. ఆస్పత్రికి వెళ్లి 'ఈ ఔషధి'లో రోగి ఆధార్ కార్డు నంబర్ కొట్టగానే ఆన్‌లైన్‌లో మెడికల్ రిపోర్టులు కనిపిస్తాయి.
- ఈ- ఔషధి సాఫ్ట్‌వేర్ వాడకంతో ఎప్పటికప్పుడు జిల్లాలోని మందుల నిల్వల వివరాలను అధికారులు తెలుసుకోవచ్చు. ఏయే మందులున్నాయి? ఎన్ని ఉన్నాయి? అనేది ఆన్‌లైన్‌లో చూడొచ్చు.

అమలులో అవాంతరాలు..

ఈ- ఔషధి కింద రోగి వివరాలను నమోదు సక్రమంగా చేయడం లేదు. ఇంటర్నెట్ సమస్యను చూపి కొందరు అంటుండగా, మరికొందరు కేసీఆర్ కిట్ తదితర వివరాలకే సమయం సరిపోతోందని చెబుతున్నారు. ఓపీ సంఖ్య తక్కువగా ఉండేప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోనూ రోగి వివరాల నమోదులో నిర్లక్ష్యం వహిస్తున్నారు. గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో ఈ సాఫ్ట్‌వేర్ వినియోగంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారిస్తే సాఫ్ట్‌వేర్ వినియోగం పకడ్బందీగా జరుగునుంది.

అక్రమాలకు అడ్డుకట్ట

- **మందుల విక్రయాలు** : కొంతమంది సిబ్బంది ప్రైవేటు ఆస్పత్రులు, మెడికల్‌షాపులకు ప్రభుత్వ మందులు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ-ఔషధి సాఫ్ట్‌వేర్‌లో వివరాలు నమోదు చేయడం మొదలైతే ఇలాంటి అక్రమాలకు తెరపడుతుంది.
- **యూసీ సమర్పించకుండానే..** : ఏరియా ఆస్పత్రులు, జిల్లా దవాఖానాల్లో ప్రభుత్వం సరఫరా చేసే మందులు సరిపోకుంటే, సంబంధిత బడ్జెట్‌లో 20 శాతం నిధులు వెచ్చించి బయటి నుంచి ఔషధాలు కొనొచ్చు. ప్రభుత్వానికి యుటిలైజేషన్ సర్టిఫికెట్(యూసీ) సమర్పించకుండానే ఆయా దవాఖానాలు అక్రమాలకు పాల్పడుతున్నాయన్న విమర్శలున్నాయి.



పనిఒత్తిడితో సంపూర్ణంగా అమలు కావడంలేదు

ఈ- ఔషధి విధానం జిల్లా వ్యాప్తంగా 70 శాతం ఆస్పత్రులలో ప్రారంభించినప్పటికీ సంపూర్ణంగా అమలు కావడంలేదు. మందుల ఇండెంట్ నమోదుకు మాత్రం సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నాం. ఓపీ రోగుల వివరాల నమోదులో వెనుకంజలో ఉన్న మాట వాస్తవమే. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈ విధానాన్ని అమలు చేయాలని ఆయా ఆస్పత్రుల వైద్యాధికారులకు ఆదేశాలు జారీచేశాం.

- డాక్టర్ అన్నప్రసన్నకుమారి, డీఎంహెచ్‌వో, జనగామ

చదువులు మధ్యలో ఆపేసినవారికి, బడికి వెళ్లి చదువుకోలేకపోయిన వయోజనులకు స్వాగతం పలుకుతున్నాయి సార్వత్రిక విద్యాకేంద్రాలు. చదవడం, రాయడం తెలిసినవారు నేరుగా ఓపెన్ టెన్త్‌లో, పది పాసైనవారు ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్ పొందొచ్చు. గత శుక్రవారం నుంచే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవగా, సెప్టెంబర్ 4 దాకా దరఖాస్తులను స్వీకరించనున్నారు. అపరాధ రుసుముతో సెప్టెంబర్ 5 నుంచి 14 వరకు ఫీజు చెల్లించే వెసులుబాటు కల్పించారు. విద్యార్హతలు పెంచుకొని భవిష్యత్తులో పదోన్నతులు పొందాలని భావించే చిరుద్యోగులకు ఇది సువర్ణావకాశం. అంతేకాకుండా ఓపెన్ ఇంటర్ పూర్తిచేసినవారు ఎంసెట్, డీఎడ్, లాసెట్ పరీక్షలు రాయొచ్చు. ఆయా కోర్సుల్లోనూ చేరి ఉన్నత విద్యలు పూర్తి చేయొచ్చు.



వయోజనులకు ఓపెన్ ఛాన్స్

సార్వత్రిక విద్యా కేంద్రాలతో ఆగిపోయిన చదువులు కొనసాగించే అవకాశం

కనీస విద్యార్హతను సముపార్జించుకునే సులువైన మార్గమిదే • సెప్టెంబరు 4 వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు

జిల్లాలవారీగా ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలు

జిల్లా	టెన్త్	ఇంటర్
జనగామ	11	13
వరంగల్ అర్బన్	10	14
వరంగల్ రూరల్	14	16
మహబూబాబాద్	16	18
జయశంకర్	17	18

❑ వరంగల్ అర్బన్ ఎడ్యుకేషన్

ఓపెన్ స్కూళ్ల పనివేళలు అభ్యర్థులందరికీ ఎంతో అనుకూలంగా ఉంటాయి. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వారు ఎంపిక చేసుకున్న అధ్యయన కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తారు. వీటిలో ప్రతీ ఆదివారం, నెలలో రెండో శనివారాల్లో తరగతులు జరుగుతాయి. విద్యా సంవత్సరంలో మొత్తం 30 కాంటాక్ట్ క్లాసులు ఉంటాయి. తరగతులకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లే విద్యార్థులకు సమకూర్చుతారు. విద్యార్థులు కనీసం 24 కాంటాక్ట్ క్లాసులకు కచ్చితంగా హాజరుకావాల్సి ఉంటుంది. వీటికి హాజరై అసైన్‌మెంట్లను పూర్తి చేసిన విద్యార్థులే పరీక్ష ఫీజు చెల్లించేందుకు అనుమతిస్తారు. విద్యార్థులు తమకు ఇచ్చిన స్టడీ మెటీరియల్స్‌లోని పాఠ్యాంశాలను చదివి కాంటాక్ట్ తరగతుల్లో సందేహాలను నివృతి చేసుకోవాలి.

ప్రవేశాలకు అర్హతలివీ..

- ఓపెన్ టెన్త్‌లో అడ్మిషన్లు పొందగోరే అభ్యర్థులు ఆగస్టు 2017 నాటికి 14 సంవత్సరాలు, ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు 15 ఏళ్లు ఉండాలి. ఎలాంటి గరిష్ట వయోపరిమితి లేదు.
- పదోతరగతిలో చేరాలంటే చదవడం, రాయడంపై అవగాహన ఉంటే చాలు.
- ఇంటర్‌కైతే పది పాసై ఉండాలి.
- ప్రవేశ దరఖాస్తుతో పాటు వయసు ధ్రువీకరణ పత్రం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు ఆయా కేటగిరీల ధ్రువపత్రాలను జతపర్చాలి.

ప్రవేశ పరీక్ష ఫీజుల వివరాలివీ..

- పదోతరగతి జనరల్ కేటగిరీకి చెందిన పురుషులు రూ.1000, దరఖాస్తు ఫీజు రూ. 100తో కలిపి మొత్తం రూ.1100 చెల్లించాలి.
- మిగిలిన అన్ని కేటగిరీలకు చెందిన మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల కేటగిరీలకు సంబంధించిన పురుషులు దరఖాస్తు ఫీజు రూ.100తో కలిపి మొత్తం అడ్మిషన్ ఫీజు రూ.700 చెల్లించాలి.
- ఇంటర్‌కైతే జనరల్ కేటగిరీకి చెందిన పురుషులు రూ.1100 అడ్మిషన్ ఫీజు, రూ.200 దరఖాస్తు ఫీజుతో మొత్తం రూ.1300 చెల్లించాలి.
- ఇతర కేటగిరీలకు చెందిన వారైతే అడ్మిషన్ ఫీజు రూ.800తో పాటు రూ.200 దరఖాస్తు ఫీజు మొత్తం రూ.1000 చెల్లించాలి. ఈ ఫీజులను మీసేవలో మాత్రమే చెల్లించాలి.

ఏప్రిల్, మేలో ఎగ్జామ్‌లు..

- పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చొప్పున చెల్లించాలి.



- టెన్త్‌లో ప్రాక్టికల్స్ కలిగిన సబ్జెక్టు పరీక్ష ఫీజుకు అదనంగా రూ.50 చెల్లించాలి.
- ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకు రూ.150 చొప్పున ప్రాక్టికల్స్ సబ్జెక్టుకు అదనంగా రూ.100 చొప్పున మీసేవా కేంద్రాల్లో చెల్లించాలి.
- ఫీజులు చెల్లించిన విద్యార్థులకు ఏప్రిల్ లేదా మే నెలల్లో జరిగే పరీక్షలకు అనుమతిస్తారు.

మార్కుల బదలాయింపునకు అవకాశం

రెగ్యులర్ పది, ఇంటర్ పరీక్షలు రాసి ఫెయిలైన విద్యార్థులు ఓపెన్ స్కూల్ పరీక్షలు రాస్తే రెగ్యులర్ కోర్సులో ఫెయిల్ అయినప్పటి నుంచి అయిదేళ్లలోపు ఓపెన్ స్కూల్లో చేరితే ఓ వెసులుబాటు ఉంది. రెగ్యులర్ పది, ఇంటర్‌లలో పాసైన వాటిలో నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులను వారు ఓపెన్ సర్టిఫికెట్‌కు బదలాయించుకునే అవకాశం ఉంది. టెన్త్‌లో హిందీ మార్కులను బదలాయించుకునే అవకాశం మాత్రం ఉండదు. ఇలా మార్కులు బదలాయించుకున్న విద్యార్థులు మిగతా మూడు సబ్జెక్టులకు పరీక్ష రాస్తే సరిపోతుంది. మార్కులను బదలాయించుకునేందుకు పదిలో సబ్జెక్టుకు రూ.100 చొప్పున, ఇంటర్‌కు రూ.150 చొప్పున ప్రవేశ సమయంలో అదనంగా చెల్లించాలి.

సబ్జెక్టులివీ..

- తెలంగాణ ఓపెన్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదోతరగతిలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, ఒరియా మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఏదైనా ఒక దానిని ఎంపిక చేసుకోవచ్చు.
- ఇంటర్‌కు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో ఒక దాన్ని ఎంపిక చేసుకోవాలి.
- పదోతరగతిలో సబ్జెక్టులను మూడు గ్రూపులుగా విభజించారు. గ్రూపు ఏలో భాషలు, గ్రూపు బిలో ప్రధాన సబ్జెక్టులు, గ్రూపు సీలో వృత్తివిద్యా కోర్సులు ఉంటాయి. గ్రూపు ఏ, బీల నుంచి కనీసం రెండు సబ్జెక్టుల చొప్పున మొత్తం ఐదు సబ్జెక్టులను విద్యార్థులు తమకు నచ్చినవి ఎంపిక చేసుకోవచ్చు.
- ఇంటర్‌లో గ్రూపు ఏలో భాషలు, గ్రూపు బీలో ఆప్షనల్స్, గ్రూప్ సీలో వృత్తివిద్యా కోర్సులు ఉంటాయి.
- విద్యార్థులు గ్రూపు ఏలో ఇంగ్లీష్‌తో పాటు నచ్చిన భాషను ఒకదానిని ఎంపిక చేసుకొని గ్రూపు సీలో వారికి నచ్చిన గ్రూపు కాంబినేషన్లను ఎంపిక చేసుకోవాలి. వృత్తి విద్యా కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు.

చిరుద్యోగులు పనిచేస్తూ చదువుకోవచ్చు



గృహిణులు, చిరుద్యోగులు చదువుకోవడానికి ఇది చక్కటి అవకాశం. ఎలాంటి అర్హతలు లేకుండా ఓపెన్ స్కూల్లో పదోతరగతి ప్రవేశాలు పొందొచ్చు. చిరుద్యోగులు వారి విద్యార్హతలు ఈ విధానంలో పెంచుకునే వీలుంది. గృహిణులు ఇంటి పని చేసుకుంటూనే చదువుకునే వెసులుబాటు ఉంది.

- సున్నం శ్రీనివాసాచారి, ఇన్‌చార్జి ఆర్‌జేడీ, వరంగల్

దళారులను ఆశ్రయించొద్దు



ఓపెన్ స్కూల్లో ప్రవేశాల కోసం దళారులను ఆశ్రయించొద్దు. సమీప అధ్యయన కేంద్రాల్లోని ప్రధానోపాధ్యాయులను లేదా ఉపాధ్యాయులను మాత్రమే సంప్రదించాలి. పాస్ గ్యారంటీ కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు. రెగ్యులర్ పాఠశాలల్లో చదువుకోలేని వారికి ఇది సువర్ణావకాశం.

- మురాల శంకర్‌రావు, కోఆర్డినేటర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్స్

"విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి"

- ప్రజాప్రతినిధులు, అధికారుల మాట

❑ మహబూబాబాద్ ఎడ్యుకేషన్

ప్రజాప్రతినిధులు, అధికారుల మాటలు కోటలు దాటినా.. చేతలు గడప దాటడం లేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు క్రీడాభాగ్యం దక్కని తీరు గురించి తెలుసుకుంటే ఎవరైనా ఇదే అభిప్రాయానికి వచ్చేస్తారు.. పాఠశాల దశ దాకా ఆటల్లో ఆరితేరిన ఎందరో విద్యార్థులు గవర్నమెంటు కాలేజీల గడపతొక్కేసరికి క్రీడలకు దూరమవుతున్నారు.. ఇందుకు కారణం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏ ఒక్క కాలేజీలోనూ ఫిజికల్ డైరెక్టర్(పీడీ) లేకపోవడమే. జూనియర్ కళాశాల అంటే చదువులకు మాత్రమే పరిమితమనే అభిప్రాయం వచ్చేలా నిర్వహణ తీరు ఉందనేది దాచినా దాగని సత్యం. ఈ ప్రతికూల ముద్రను తొలగించుకునే దిశగా అడుగులుపడాల్సిన అవసరం ఉంది.

కొత్త జిల్లాలు ఏర్పడినా..

జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు క్రీడాభ్యాసం అనేది కలగానే మిగిలిపోయింది. ప్రభుత్వం క్రీడా సామగ్రిని అందిస్తున్నా.. దాన్ని విద్యార్థులకు అందించి వినియోగంలోకి తెచ్చేందుకు ఫిజికల్ డైరెక్టర్లు(పీడీలు) లేరు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా అన్ని కళాశాలల్లోనూ ఇదే పరిస్థితి. కొత్త జిల్లాలు ఏర్పడి 10 నెలలు గడుస్తున్నా ఒక్క కళాశాలకు కూడా పీడీని నియమించకపోవడం గమనార్హం.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

జూనియర్ కాలేజీలు	49
మొత్తం విద్యార్థులు	14,624
ప్రథమ సంవత్సరం	7721
ద్వితీయ సంవత్సరం	6903

ప్రభుత్వం నిర్లక్ష్యం.. విద్యార్థుల్లో నైరాశ్యం

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా జూనియర్ కాలేజీల్లో పీడీల నియామకానికి బాటలు పడటం లేదు. ఫలితంగా పదోతరగతి తర్వాత క్రీడల్లో రాణించాలని భావించిన పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులను నైరాశ్యం ఆవరిస్తోంది. తమకెంతో ఇష్టమైన క్రీడలో నైపుణ్యాన్ని పెంచుకునే అవకాశం లేకపోయిందని ఎంతోమంది వాపోతున్నారు. ఒకవేళ గవర్నమెంటు జూనియర్ కాలేజీల్లో పీడీలను నియమించి, విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదు అందిస్తే ఎన్నో సత్ఫలితాలు వస్తాయి. ఎంతోమంది విద్యార్థులు స్పోర్ట్స్ కోటాలో సీట్లు పొందే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంలోనూ క్రీడా కోటా ఎంతో తోడ్పడుతుంది.

క్రీడా సామగ్రి అందినా.. ఫలితం సున్నా

విద్యార్థులు క్రీడారంగంలో రాణించేందుకు ప్రభుత్వం వివిధ క్రీడలకు సంబంధించిన కిట్‌లను ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పంపిణీ చేసింది. ఈవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 49 కళాశాలలకు క్రీడా కిట్లు అందాయి. వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్యారంబోర్డు, క్రికెట్, చెస్, ఫుట్‌బాల్, షటిల్‌బ్యాట్లు, షాట్‌పుట్, జావలిన్ త్రో, టెన్నికాయిట్, డిస్కస్‌త్రో, టెన్నిస్‌బాల్, స్కిప్పింగ్, స్పోర్ట్స్‌డ్రెస్, గాలిపంపులను కళాశాలలకు పంపిణీచేశారు. ఇవన్నీ అందడం ఒక ఎత్తు.. వాటిని వినియోగంలోకి తేవడం మరో ఎత్తు. వినియోగంలోకి తెచ్చే పనే పడకేసింది.

మహబూబాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల





0/49

ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్లు లేరాయె..

- మైదానాలు, క్రీడా సామగ్రి ఉన్నా.. ఆటలాడించే వారే లేకపాయె..
- ఏళ్లుగా భర్తీకి నోచుకోని పీడీ పోస్టులు
- క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహం కరువు

జూనియర్ కాలేజీల్లో విద్యార్థులు, పీడీల సంఖ్య

జిల్లా	కళాశాలలు	ప్రథమ	ద్వితీయ	మొత్తం	పీడీలు
వరంగల్ అర్బన్	09	2056	2321	4377	0
వరంగల్‌రూరల్	11	1209	980	2189	0
మహబూబాబాద్	10	1440	1280	2720	0
జయశంకర్	12	1554	1450	3004	0
జనగామ	07	1462	862	2324	0
మొత్తం	49	7721	6903	14,624	0



ప్రాచీన ఆలయాలకు దూపం, దీపం నామమాత్రం

- డీడీఎం స్కీం ద్వారా ఒక్కో ఆలయానికి నెలకు రూ.6 వేలు
- నిధుల వినియోగంపై పర్యవేక్షణ కరువు
- పలు కోవెలల్లో పూజాదికాల నిర్వహణ అంతంతే..

❑ పోచమ్మమైదాన్ (వరంగల్ అర్బన్ జిల్లా)

చారిత్రక ప్రాధాన్యం, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం సంతరించుకున్న ప్రాచీన ఆలయాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్నెన్నో ఉన్నాయి. ఇటువంటి ఎన్నో కోవెలలు దూప,దీప నైవేద్యాలకు నోచుకోని పరిస్థితిని గతంలో ఎదుర్కొనేవి. ఈ పరిస్థితిని మార్చి, ప్రాచీన దేవాలయాలకు నిత్యం దూప,దీప నైవేద్యాలు అందించేందుకు ప్రవేశపెట్టిన పథకమే డీడీఎం. దీని అమలుపై పర్యవేక్షణ కొరవడింది. పూజాదికాలు నిర్వహించేందుకు ప్రతినెలా ప్రభుత్వం నుంచి అందుతున్న రూ.6వేలను సద్వినియోగం చేసుకుంటున్న ఆలయాలు ఎన్ని? అనే దిశగా ఆరా తీసిన దాఖలాలే లేవు. వివరాలివీ..

ప్రాచీన ఆలయాలను తెరిపించి, వాటికి దూపదీప నైవేద్యాలు సమర్పించేందుకు నాటి సీఎం వైఎస్ఆర్ దూప, దీప నైవేద్యాలు (డీడీఎం) స్కీమ్‌ను ప్రవేశపెట్టారు. అప్పట్లో ఈ పథకం కింద ఎంపిక చేసిన ఒక్కో ప్రాచీన ఆలయంలో దూప,దీపాలు అందించేందుకు ప్రతినెలా రూ.2500 చెల్లించేవారు. రాష్ట్ర విభజన అనంతరం టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీడీఎం సాయాన్ని రూ.6వేలకు పెంచారు. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా ఆయా ఆలయాల అర్చకుల ఖాతాల్లో జమచేస్తున్నారు. ఆ రూ.6 వేలతో పూజాదికాలు నిర్వహిస్తున్నారు అర్చకులు.

స్కీం పరిధిలో 285 ఆలయాలు..

దూప, దీప నైవేద్యాల స్కీం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో 285 ప్రాచీన ఆలయాలను ఎంపిక చేశారు. ఇందులో అధిక శాతం ఆలయాలు గ్రామీణ ప్రాంతాలలోనే ఉన్నాయి. ఇలా సుదూరంగా ఉన్న ఒక్కో గుడికి, ఒక్కో విశిష్టత , చారిత్రక నేపథ్యం ఉన్నాయి. ఆలయాలలో పూజలు నిర్వహించే అర్చకులే ప్రస్తుతానికి దూపదీప నైవేద్యాల పథకం అమలు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

'పలు'చగా నిధుల వినియోగం..

డీడీఎం స్కీం పరిధిలోని పలు ఆలయాల్లో దూప, దీప నైవేద్యాల నిర్వహణ సరిగ్గా జరగడం లేదనే ఆరోపణలూ వస్తున్నాయి. పలుచోట్ల వారానికి ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే దూప, దీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా దూప దీప నైవేద్యాలు సమర్పించే ఆలయాలు ఏ మేరకు ఉన్నాయనేది అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో నిధుల వినియోగం మరింత పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన అవసరం ఉంది. డీడీఎం స్కీం ద్వారా అందే ప్రతీపైసా సద్వినియోగం అయ్యేలా చూడాలి.

'భిన్న పరీక్ష' నుంచి కచ్చితంగా ప్రశ్నలు

భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది. ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

మోడల్ - 1
పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

టైప్ 1: నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 2: నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 1

1. ఎ) భరతనాట్యం బి) కూచిపూడి సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: **సి**
వివరణ: భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

2. ఎ) అక్టోబరు బి) నవంబరు సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: **బి**
వివరణ: నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

3. ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: **ఎ**
వివరణ: ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

4. ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: **డి**
వివరణ: పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

5. ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: **డి**
వివరణ: గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

6. ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: **ఎ**
వివరణ: బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

7. ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: **బి**
వివరణ: జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

8. ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: **సి**
వివరణ: నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

9. ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: **ఎ**
వివరణ: గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

10. ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్ సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: **ఎ**



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

11. ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: **సి**
వివరణ: తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

12. ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: **డి**
వివరణ: కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

13. ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: **డి**
వివరణ: లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

14. ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: **బి**
వివరణ: గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

15. ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: **డి**
వివరణ: వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

16. ఎ) బైకాల్ బి) ధాల్ సి) చిలక డి) థార్
సమాధానం: **డి**
వివరణ: థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

17. ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: **సి**
వివరణ: ఎల్లోరా మినహా మిగిలివన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

18. ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: **బి**
వివరణ: ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. అయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

19. ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటూమినస్
సమాధానం: **ఎ**
వివరణ: గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

20. ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) డోగ్రి
సమాధానం: **డి**
వివరణ: డోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. డోగ్రి అనేది ఒక భాష.

21. ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: **బి**
వివరణ: వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

22. ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: **ఎ**
వివరణ: నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

23. ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: **సి**
వివరణ: మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

24. ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: **డి**
వివరణ: బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

25. ఎ) పాదరసం బి) ఆక్సిజన్ సి) మెగ్నీషియం డి) సోడియం
సమాధానం: **ఎ**
వివరణ: నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

26. ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: **ఎ**
వివరణ: కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

27. ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జెంతియా
సమాధానం: **సి**
వివరణ: కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

28. ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: **డి**
వివరణ: ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

29. ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: **సి**
వివరణ: అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

30. ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబి
సమాధానం: **డి**
వివరణ: గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

31. ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతావన్ డి) ఫారడే
సమాధానం: **సి**
వివరణ: బీతావన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

32. ఎ) క్యారట్ బి) అల్లం సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: **డి**
వివరణ: ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

33. ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: **ఎ**
వివరణ: గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

34. ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: **బి**
వివరణ: బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి వ్యక్తి.

35. ఎ) దాద్రానగర్ హవేలి బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి డి) జార్ఖండ్
సమాధానం: **డి**
వివరణ: జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

36. ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: **సి**
వివరణ: బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

37. ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్ సి) అబుల్ ఫజిల్ డి) తాన్‌సేన్
సమాధానం: **బి**
వివరణ: ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

38. ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: **బి**
వివరణ: అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

39. ఎ) మెరీనా బి) జెర్సోప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: **ఎ**
వివరణ: మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్.

JOBS ఉద్యోగాలు

సిడాక్

నొయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 67

ప్రాజెక్ట్ మేనేజర్ **ఖాళీలు**: 2
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 50 ఏళ్లు మించరాదు

ప్రాజెక్ట్ ఇంజనీర్ **ఖాళీలు:** 65
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 37 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవా త హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 18
చిరునామా: Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307
వెబ్‌సైట్: http://cdac.in/

ఎస్ఎస్‌సి ఎస్ఆర్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సి ఎస్ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 66

టెక్నికల్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 3
అర్హత: డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించరాదు.

వర్క్‌షాప్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 1
అర్హత: బిఇ/ బిటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్) **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజ నీరింగ్)/ డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్ టైల్ టెక్నాలజీ/ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు అనుభవం కూడా ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 34
అర్హత: 10వ తరగతి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

లేడీ మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 15
అర్హత: 10వ తరగతితోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 2
అర్హత: 10వ తరగతితోపాటు డిప్లొమా(సివిల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 9
అర్హత: 10వ తరగతితోపాటు ఐటిఐ సర్టిఫికెట్ (సివిల్ ఇంజనీరింగ్) ఉండాలి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

ఎవల్యూషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 1
